# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

2.4.2026 గురువారం Thursday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 251 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana









రాష్ట్రంలో జరుగుతున్న మైనింగ్ స్కామ్‌పై ప్రభుత్వం సీఐడీ విచారణ పేరుతో కాలయాపన చేస్తోందని, దీనిపై తక్షణమే 'హౌస్ కమిటీ' వేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు.

3

## పొంగులేటి అక్రమాలపై 'హౌస్ కమిటీ' వేయాల్సిందే

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ ▪ సీఐడీ విచారణతో న్యాయం జరగదు

▪ కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలి

ప్రజల పక్షాన ప్రశ్నిస్తే కేసులతో గొంతు నొక్కుతారా? : బీఆర్ఎస్ నేతలు

## రేషన్ కార్డుల ఏరివేత దుర్మార్గం

5 లక్షల కార్డులు ఇచ్చి.. 15 లక్షలు తొలగించే కుట్ర..




- ఐటీ రిటర్న్‌ను సాకుగా చూపడం అన్యాయం
- కొండగట్టు ఘటనపై విచారం..
- పనుల్లో నిర్లక్ష్యంపై విచారణకు డిమాండ్
- రాష్ట్ర ప్రభుత్వంపై కవిత ధ్వజం!

3

## నిప్పుల కొలిమిలా

రానున్న మూడు నెలలు మండుటెండలు ఖాయం!





- ఏప్రిల్ నుంచి జూన్ వరకు సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు
- పది రోజులకు పైగా వీయనున్న వడగాడ్పులు.. ఐఎండీ హెచ్చరిక

2



## అడుగంటుతున్న జూరాల

- పాలమూరు రైతాంగంలో సాగునీటి సెగ!
- డెడ్ స్టోరేజీకి చేరిన నీటిమట్టం..
- ఎండిపోతున్న కోయిల్ సాగర్ ఆయకట్టు
- కర్ణాటక సర్కారుతో మంత్రి ఉత్తమ్ సంప్రదింపులు..
- 5 టీఎంసీల కోసం విజ్ఞప్తి

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ప్రాణాధారమైన జూరాల ప్రాజెక్టు ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో పాలమూరు రైతాంగం ఆందోళన చెందుతోంది. దీంతో సాగునీటితో పాటు, తాగునీటి కష్టాలు తప్పేలా లేవు. ఎండలు ముదురుతున్న కొద్దీ ప్రాజెక్టులో నీటి మట్టం అట్టడుగుకు పడిపోవడంతో కోయిల్ సాగర్ లిఫ్ట్ మోటార్లకు నీరు అందడం లేదు. దీని ప్రభావం కోయిల్ సాగర్ చివరి ఆయకట్టుపై తీవ్రంగా పడుతోంది, సాగునీరు అందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోయే స్థితికి చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

2



కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు

## తీపి కబురు

ఇక నేరుగా ఖాతాల్లో జీతాలు జమచేయనున్న ప్రభుత్వం

2



## రెండు జీపీలకు వికాస్ పురస్కారాలు

'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్' అవార్డుల ప్రకటన

హర్షం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క.

.. వివరాలు 2లో

# భూవివాదాలకు చెక్!

## నేటి నుంచి భూభారతి అమలు

ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా సేవలు ప్రారంభం

ప్రతి సర్వే నంబర్‌కు 'భూధార్' ▪ అధికారులతో పొంగులేటి సమీక్ష





రాష్ట్రంలో దశాబ్దాలుగా వేధిస్తున్న భూవివాదాలకు చరమగీతం పాడేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 'భూభారతి' పోర్టల్‌ను సిద్ధం చేసింది. ఏప్రిల్ 2వ తేదీ నుంచి రాష్ట్రంలోని ఐదు ఎంపిక చేసిన మండలాల్లో ప్రయోగాత్మకంగా ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. బుధవారం సచివాలయంలో రెవెన్యూ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పొంగులేటి వివరాలు వెల్లడించారు.

**హైదరాబాద్, ఏప్రిల్ 1:** తెలంగాణలో భూవివాదాలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది. ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి సేవలు అమలు చేయనుంది. ప్రయోగాత్మకంగా 5 మండలాల్లో పోర్టల్ ప్రారంభం కానుంది. మొదటి దశలో ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా

మిగతా 2 లో



## కొత్త పట్టాదారులకు 'రైతు భరోసా' ఊరట


▪ ఏప్రిల్ 15 నుంచి నిధుల జమ! ▪ 85వేల మంది కొత్త రైతులకు లబ్ధి..

- దరఖాస్తుల పరిశీలనలో వ్యవసాయ శాఖ
- యాసంగి రెండో విడతగా రూ. 9,000 కోట్ల పంపిణీ లక్ష్యం

2

## ఒరాకిల్ 'లేఆఫ్' బాంబు

- 30వేల మంది టెక్కీల తొలగింపు!
- అందులో 12 వేలమంది భారతీయులే..
- తెల్లవారుజామున 6 గంటలకే టర్మినేషన్ మెయిల్స్
- లాభాల్లో ఉన్నా ఖర్చుల కోత పేరిట వేటు
- ఐటీ లోకంలో తీవ్ర కలకలం




ప్రపంచ ప్రసిద్ధ సాఫ్ట్‌వేర్ దిగ్గజం 'ఒరాకిల్' ఐటీ రంగంలో పెను సంచలనం సృష్టించింది. సంస్థాగత పునర్వ్యవస్థీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన సిబ్బందిలో ఏకంగా 18 శాతం మందిని ఇంటికి పంపాలని నిర్ణయించింది. ఈ భారీ కోతలో భాగంగా దాదాపు 30,000 మంది ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోయారు. అత్యంత విచారకరమైన విషయం ఏంటంటే.. ఈ బాధితుల్లో సుమారు 12,000 మంది భారతీయులే ఉన్నట్లు సమాచారం.

4

## నాటో నుంచి తప్పుకుంటాం



- అది 'కాగితపు పులి' కూటమి..
- ఇరాన్ యుద్ధంలో మిత్రదేశాల సహకారం సున్నా.. అందుకే ఈ ఆలోచన
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలనం
- బ్రిటన్ నౌకాదళంపై ఎద్దేవా..
- ట్రంప్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన కీర్ స్టార్మర్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంతర్జాతీయ వేదికపై మరోసారి బాంబు పేల్చారు. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సైనిక కూటమిగా భావించే నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) నుంచి అమెరికా వైదొలిగే అంశాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

4



# రెండు జీపీలకు వికాస్ పురస్కారాలు

**మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామాలకు అరుదైన గౌరవం!**

**'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్' అవార్డుల ప్రకటన**

**మంత్రి సీతక్క హర్షం వ్యక్తం.. పారదర్శక పాలనకు నిదర్శనమని వెల్లడి**

**హైదరాబాద్, ఏప్రిల్ 1:** గ్రామీణాభివృద్ధి, సుస్థిర పరిపాలనలో తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయిలో మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకమైన 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాల'ను ప్రకటించగా, రాష్ట్రంలోని రెండు గ్రామ పంచాయతీలు ఈ గౌరవాన్ని దక్కించుకున్నాయి. వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన పంచాయతీలు వివిధ విభాగాల్లో జాతీయ స్థాయి అవార్డులను కైవసం చేసుకున్నాయి. వికారాబాద్ జిల్లా కోటేపల్లి మండలానికి చెందిన మోతుకుపల్లి గ్రామ పంచాయతీ 'గుడ్ గవర్నెన్స్' (ఉత్తమ పాలన) విభాగంలో జాతీయ పురస్కారాన్ని సాధించింది. అలాగే, సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీ 'విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ' (మహిళా అనుకూల పంచాయతీ) విభాగంలో అత్యుత్తమ గుర్తింపు పొందింది. గ్రామ స్థాయిలో పారదర్శకమైన పరిపాలన అందించడం, అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయడం, మహిళా సాధికారత మరియు భద్రతలో చూపిన అసాధారణ కృషికి గాను ఈ అవార్డులు లభించాయి.

**మంత్రి సీతక్క అభినందనలు**

జాతీయ స్థాయిలో తెలంగాణ పంచాయతీలకు ఈ గౌరవం దక్కడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. పారదర్శక పాలన, మహిళా సంక్షేమం దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న పటిష్ట చర్యలకు ఈ అవార్డులే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఈ విజయం సాధించిన మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, గ్రామస్థులకు ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ విజయాలు రాష్ట్రంలోని ఇతర పంచాయతీలకు ప్రేరణగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరిన్ని గ్రామాలు జాతీయ స్థాయిలో రాష్ట్ర కీర్తిని చాటాలని ఆమె ఆకాంక్షించారు.

# జీఎస్టీ వసూళ్లలో 8.3శాతం వృద్ధి

**మార్చిలో రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు**

**హైదరాబాద్, ఏప్రిల్ 1:** దేశంలో జీఎస్టీ వసూళ్లు నెలనెలా భారీగా వసూలు అవుతున్నాయి. దీంతో కేంద్రానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. దేశంలో స్థూల వస్తు, సేవల పన్ను వసూళ్లు భారీగా నమోదయ్యాయి. మార్చి నెలకు గానూ 8.8 శాతం వృద్ధితో రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాలు పెరగడం, దిగుమతుల కారణంగా పన్ను వసూళ్లు ఈస్థాయిలో పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలను బట్టి తెలుస్తోంది. గతేడాది మార్చిలో జీఎస్టీ వసూళ్లు రూ.1.83 లక్షలుగా నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాల ద్వారా 5.8 శాతం వృద్ధితో రూ.1.46 లక్షల కోట్ల మేర జీఎస్టీ ఆదాయం సమకూరగా.. దిగుమతుల రూపంలో 17.8 శాతం వృద్ధితో రూ.53,861 కోట్ల వసూళ్లు నమోదయ్యాయి. రిఫండ్ల సర్దుబాటు అనంతరం నికరంగా జీఎస్టీ వసూళ్లు రూ.1.78 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి 8.3 శాతం వృద్ధితో జీఎస్టీ వసూళ్లు రూ.22.27 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది.

# దూసుకొచ్చిన కారు

**నేడు వివాహ నిశ్చితార్థం...అంతలోనే రోడ్డు ప్రమాదం**

**ఖమ్మం, ఏప్రిల్ 1:** జిల్లాలో విషాదం నెలకొంది. ఎంగేజ్‌మెంట్ చేసుకోవాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణషాపుకు వెళ్లి తిరిగి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన గొడ్డుగొర్ల ప్రసాద్(28) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలే అతనికి వివాహం కూడా నిశ్చయమైంది. గురువారం నాడు నిశ్చితార్థం కావాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణ షాపునకు ప్రసాద్ వెళ్లాడు. తిరిగి ఇంటికొచ్చేప్పుడు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఓ కారు ప్రసాద్‌ను ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో ప్రసాద్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, రేపు నిశ్చితార్థం చేసుకోవాల్సిన యువకుడు.. ఇలా పాడే ఎక్కడంతో మద్దులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# కొండగట్టు ఆలయంలో అపశృతి

**చలువ పందిళ్లు కూలి 15మందికి గాయాలు**



**జగిత్యాల, ఏప్రిల్ 1:** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజన్న ఆలయంలో అపశ్రుతి నెలకొంది. ఆలయం వద్ద వేసిన చలువ పందిరి కూలి 15 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకంగా ఏర్పాట్లు చేయడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపిస్తున్నారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో హనుమాన్ మాల విరమణ కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు కూడా వేశారు. ఈ క్రమంలో నాసిరకంగా వేయడంతో చలువ పందిరి కూలిపోయిందని భక్తులు ఆరోపిస్తున్నారు.

# అడుగంటుతున్న జూరాల



**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ప్రాణాధారమైన జూరాల ప్రాజెక్టులో నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో పడిపోవడంతో ఆయకట్టు రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోంది. ఎండలు ముదురుతున్న కొద్దీ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో సాగునీటితో పాటు తాగునీటి ఎద్దడి ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కోయిల్ సాగర్ లిఫ్ట్ మోటార్లకు నీరు అందకపోవడంతో చివరి ఆయకట్టు భూముల్లో పంటలు ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం రంగంలోకి దిగింది. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాలకు నీటిని విడుదల చేయించేందుకు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి, తక్షణమే కనీసం 5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరారు. కేవలం ఫోన్ సంప్రదింపులకే పరిమితం కాకుండా, పాలమూరు జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల బృందం మరో వారం రోజుల్లో బెంగళూరుకు వెళ్లి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను నేరుగా కలవాలని నిర్ణయించుకుంది. కోయిల్ సాగర్ ఆయకట్టును ఆదుకోవడానికి తక్షణమే నీటిని విడుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. చేతికి వచ్చిన పంటలు కళ్ల ముందే ఎండిపోతుంటే రైతులు తల్లడిల్లిపోతున్నారు. కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఆల్మట్టి లేదా నారాయణపూర్ నుండి నీటిని విడుదల చేస్తేనే ఈ గండం నుంచి గట్టెక్కే అవకాశం ఉంది. ప్రస్తుతం నెలకొన్న సాగునీటి సంక్షోభంపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపైనే రైతాంగం ఆశలు పెట్టుకుంది.



# నేటి నుంచి భూభారతి అమలు

మొదటి పేజీ తరువాయి

ఆమన్ గల్, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి, నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో భూభారతి సేవలు ప్రారంభం కానున్నాయి. ఇక్కడ వచ్చే ఫలితాలను విశ్లేషించి, అవసరమైన మార్పులు చేసిన తర్వాత రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. భూభారతి విధానంలో అత్యంత కీలకమైన అంశం 'భూధార్'. ఆధార్ కార్డు తరహాలోనే ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేకమైన భూధార్ నంబర్‌ను కేటాయించనున్నారు. ఇప్పటికే నక్ష లేని ఐదు గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి భూధార్‌ను కేటాయించినట్లు మంత్రి గుర్తు చేశారు. ఇకపై వ్యవసాయ భూముల క్రయవిక్రయాల సమయంలో తప్పనిసరిగా సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను కూడా ప్రభుత్వం అమలు చేస్తోంది. గతంలోని ధరణి పోర్టల్‌లో ఉన్న 36 రకాల మాడ్యూల్స్ వల్ల కలిగే గందరగోళాన్ని తొలగిస్తూ, భూభారతిలో అన్నింటినీ ఒకే చాప్టర్ కిందకు తీసుకువచ్చినట్లు మంత్రి వివరించారు. రైతులు తమ ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయ్యి, ఒక్క క్లిక్‌తో తమ భూమికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని పొందేలా పోర్టల్‌ను రూపొందించారు. ఎన్నికల హామీ మేరకు భూభారతి చట్టాన్ని తెచ్చామని, దీని ద్వారా రైతులకు భూమిపై పూర్తి భరోసా కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# కొత్త పట్టాదారులకు 'రైతు భరోసా' ఊరట




- ఏప్రిల్ 15 నుంచి నిధుల జమ!
- 85 వేల మంది కొత్త రైతులకు లబ్ధి..
- దరఖాస్తుల పరిశీలనలో వ్యవసాయ శాఖ
- యాసంగి రెండో విడతగా రూ. 9,000 కోట్ల పంపిణీ లక్ష్యం

**హైదరాబాద్, ఏప్రిల్ 1:** తెలంగాణ రాష్ట్రంలోని కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ఇప్పటివరకు పాత లబ్ధిదారులకే పరిమితమైన 'రైతు భరోసా' పెట్టుబడి సాయాన్ని, ఇకపై కొత్తగా భూములు కొనుగోలు చేసి పట్టా పొందిన రైతులకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా పట్టా పొందిన వారు సుమారు 85 వేల మంది ఉన్నారని అంచనా వేయగా, అందులో ఇప్పటికే 62 వేల మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు.

**ఏప్రిల్ 15 నుంచి ఖాతాల్లోకి నగదు:**

ప్రస్తుతం ఈ దరఖాస్తులను వ్యవసాయ శాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. భూమి వివరాలు, పట్టాదారుల నిజానిజాలను నిర్ధారించిన తర్వాత వారం రోజుల్లో తుది జాబితాను సిద్ధం చేయనున్నారు. అర్హులుగా తేలిన కొత్త రైతులకు ఏప్రిల్ 15 నుంచి 20వ తేదీల మధ్య యాసంగి (రబీ) రెండో విడత నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ సీజన్‌లో మొత్తం రూ. 9,000 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత వానాకాలం సీజన్‌లో లబ్ధి పొందిన ప్రతి రైతుకు, ఈ యాసంగిలో కూడా ఎటువంటి కోతలు లేకుండా పూర్తిస్థాయి సాయం అందనుంది.

**రికార్డు స్థాయిలో నిధుల పంపిణీ:**

2025-26 ఖరీఫ్ సీజన్‌లో సుమారు 69.39 లక్షల మంది రైతులకు ఎకరానికి రూ. 6,000 చొప్పున మొత్తం రూ. 8,744.13 కోట్లను కేవలం తొమ్మిది రోజుల వ్యవధిలోనే పంపిణీ చేసి ప్రభుత్వం రికార్డు సృష్టించింది. తాజా గణాంకాల ప్రకారం రైతు భరోసా లబ్ధిదారుల సంఖ్యలో నల్లగొండ జిల్లా 5.22 లక్షల మందితో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో సంగారెడ్డి (3.53 లక్షలు), ఖమ్మం (3.35 లక్షలు), సిద్ధిపేట (3.18 లక్షలు) జిల్లాలు ఉన్నాయి. మార్చి 22న మొదటి విడత నిధులను విడుదల చేసిన ప్రభుత్వం, ఏప్రిల్ నెలాఖరులోపు మూడో విడత నిధులను కూడా విడుదల చేసేందుకు కసరత్తు చేస్తోంది.

# నిప్పుల కొలిమిలా

**రానున్న మూడు నెలలు మండుటెండలు ఖాయం!**

**ఏప్రిల్ నుంచి జూన్ వరకు సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు**

**పది రోజులకు పైగా వీయనున్న వడగాడ్పులు.. ఐఎండీ హెచ్చరిక**

**హైదరాబాద్, ఏప్రిల్ 1:** తెలుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చేదు వార్త వినిపించింది. ఈ ఏడాది వేసవి సీజన్ మొత్తం ఎండలు మంట పుట్టించనున్నాయని, ఏప్రిల్ నుంచి జూన్ వరకు పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయని హెచ్చరించింది. రానున్న మూడు నెలల కాలానికి సంబంధించి ఎండలు, వడగాడ్పులు, వర్షాలపై ఐఎండీ బుధవారం ప్రత్యేక బులెటిన్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో ఈసారి భానుడు ప్రతాపం చూపనున్నాడు. ఏప్రిల్ నెలలో సగటున మూడు నుంచి నాలుగు రోజులు వడగాడ్పులు వీస్తుండగా, మే మరియు జూన్ నెలల్లో వీటి తీవ్రత మరింత పెరిగి పది రోజులకు పైగా కొనసాగే అవకాశం ఉంది. కేవలం పగటి పూట మాత్రమే కాకుండా, రాత్రి వేళల్లో కూడా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉండి ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేయనుంది. దేశంలోని 95 శాతం ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

**వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం:**

ఏప్రిల్ నెలలో ఉభయ గోదావరి జిల్లాలు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. అయితే, ఈశాన్య రాష్ట్రాలు మినహా దేశంలోని అనేక ప్రాంతాల్లో ఏప్రిల్‌లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. మార్చి నెలలో కూడా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో 'లానినా' ప్రభావం చివరి దశకు చేరుకుంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు వాతావరణం తటస్థంగా ఉండి, నైరుతి రుతుపవనాలు ప్రారంభమయ్యే జూన్ మాసం నుంచి 'ఎల్‌నినో' పరిస్థితులు మొదలవుతాయని ఐఎండీ వెల్లడించింది. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా వడగాడ్పుల సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు

- ఇక నేరుగా ఖాతాల్లో జీతాలు జమచేయనున్న ప్రభుత్వం
- వేలాది మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరే అవకాశం




**హైదరాబాద్, ఏప్రిల్ 1:** తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక తీపి కబురు అందించింది. గత కొన్నేళ్లుగా వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న తీవ్ర జాప్యం, మధ్యవర్తుల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏప్రిల్ నెల నుంచి ఈ ఉద్యోగులందరికీ నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా వేతనాలు అందుతుంటాయి. దీనివల్ల కమిషన్ల పేరిట కొంత మొత్తం కట్ అవ్వడమే కాకుండా, నెలల తరబడి జీతాలు రాక కార్మికులు ఇబ్బందులు పడేవారు. తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు, గురుకులాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య శాఖ , మైనార్టీ సంక్షేమ శాఖల్లో పనిచేసే వేలాది మందికి లబ్ధి చేకూరనుంది. నేరుగా ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది.ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ప్రస్తుతం ఏ విధంగానైతే 'ఇంటిగ్రేటెడ్ ÷నాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' ద్వారా జీతాలు అందుతున్నాయో, అదే విధానాన్ని కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా వర్తింపజేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులు సిబ్బంది ఆధార్ కార్డులను వారి బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం చేసే పక్రియను పూర్తి చేశారు. ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన డేటాను కూడా పంపడం జరిగింది. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, టెక్నికల్ వర్కర్లు గతంలో అనేక కష్టాలు పడేవారు. స్థానిక పన్నులు వసూలైతేనే జీతాలు ఇస్తామనే నిబంధనలతో అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చేవారు. టార్గెట్లు పూర్తికాకపోతే నెలల తరబడి వేతనాలు ఆగిపోయేవి. దీంతో కార్మికులు తమ నిత్యవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయనుండటంతో, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే జీతం వచ్చే అవకాశం ఏర్పడింది.



# రేషన్ కార్డుల ఏరివేత దుర్మార్గం

**5 లక్షల కార్డులు ఇచ్చి.. 15 లక్షలు తొలగించే కుట్ర..**

**ఐటీ రిటర్న్స్‌ను సాకుగా చూపడం అన్యాయం**

**ప్రభుత్వంపై కల్వకుంట్ల కవిత ధ్వజం!**

**హైదరాబాద్, ఏప్రిల్ 1:** తెలంగాణ రాష్ట్రంలో పేదలకు అందాల్సిన రేషన్ కార్డుల విషయంలో రేవంత్ రెడ్డి సర్కార్ అనుసరిస్తున్న తీరుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రేషన్ కార్డుల ఏరివేత పేరిట ప్రభుత్వం చేపట్టిన చర్యలు దుర్మార్గమని, వీటిని తక్షణమే నిలిపివేయాలని ఆమె డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆమె, కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను వేధిస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. కొత్తగా 5 లక్షల కార్డులు ఇచ్చామని ప్రచారం చేసుకుంటూనే, మరోవైపు రకరకాల సాకులతో 15 లక్షల కార్డులను తొలగించేందుకు కుట్ర పన్నుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ఐటీ రిటర్న్స్ ఫైల్ చేయడం, ప్రైవేట్ ఉద్యోగాలు చేయడం వంటి కారణాలను చూపి పేదల నోటి కాడ కూడు తీసేయడం అన్యాయమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పేదరిక నిర్మూలన దిశగా అడుగులు వేయాల్సిన ప్రభుత్వం, ఇలాంటి చర్యలతో వారిని మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని హితవు పలికారు. జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న ఆలయంలో జరిగిన చలువ పందిళ్ల ప్రమాదంపై కూడా కవిత స్పందించారు. హనుమాన్ చిన్న జయంతి వేడుకల కోసం నాసిరకం పందిళ్లు వేయడం వల్లే అవి కూలి 15 మంది భక్తులు గాయపడ్డారని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని మండిపడ్డారు. పనుల్లో తీవ్రమైన నాణ్యతా లోపం కనిపిస్తోందని, ఉత్సవాల సమయంలో ఇలాంటి ప్రమాదాలు జరగడం భక్తుల భద్రతపై ఆందోళన కలిగిస్తోందని అన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## గ్యారెంటీలపై నిలదీయండి: రామ్

**హైదరాబాద్, ఏప్రిల్ 1:** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో 6 గ్యారంటీల అమలులో అనుసరిస్తున్న నిర్లక్ష్యవైఖరిపై నిరసన తెలుపుతూ నిలదీయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామచందర్‌రావు పార్టీ కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ముందుగా 6 గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి రెండేళ్లయినా ఇంతవరకు అమలు చేయకుండా మోసం చేస్తుందని అన్నారు. ఓటర్ల జాబితా సమగ్ర సర్వేలో బూత్ స్థాయి కార్యకర్తలు బీఎల్‌వోలతో కలిసి ఇంటింటికి వెళ్లి బోగస్ ఓటర్లను ఏరి వేయడంలో సహకరించాలన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు రాబోయే రోజుల్లో ఎప్పుడైనా వచ్చే అవకాశమున్నందున పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

## అమరావతి బిల్లును స్వాగతించిన మంత్రి పొన్నం

**తెలంగాణ హామీలు అమలు చేయాలని డిమాండ్**

**హైదరాబాద్, ఏప్రిల్ 1:** ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లు.. లోక్‌సభలో ఆమోదం పొందడాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఏపీ ప్రజలకు అభినందనలు తెలిపారు. రాజధాని నిర్మాణం ద్వారా ఎపి పురోగమించాలని ఆకాంక్షించారు. తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలను కూడా వెంటనే అమలు చేయాలని కేంద్రానికి డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలులో కేంద్రం వివక్ష చూపుతోందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం వంటి హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు.

## మార్కాపురం బస్సు ప్రమాద డ్రైవర్, యజమాని అరెస్ట్

**మార్కాపురం,ఏప్రిల్1 :** మార్కాపురం బస్సు ప్రమాదం కేసులో డ్రైవర్ యువరాజు, బస్సు యజమాని హరికృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘోర ప్రమాదంలో 14 మంది ప్రయాణికులు సజీవ దహనమవగా.. మరో 28 మంది గాయపడ్డారు. మార్చి 26న తెల్లవారుజామున మార్కాపురం మండలం రాయవరం సమీపంలో హరికృష్ణ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. హైదరాబాద్‌లో శ్రావణి ట్రావెల్స్ నడుపుతున్న యార్లగడ్డ కోటేశ్వరరావు వద్ద బస్సును సెకండ్ హ్యాండ్‌గా కొనుగోలు చేసి హరికృష్ణారెడ్డి నడుపుతున్నట్లు తెలుస్తోంది. ప్రమాదం సమయంలో బస్సులో సుమారు 35 నుంచి 41 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యం, బస్సు యాంత్రిక లోపాలు కారణమని ప్రాథమిక విచారణలో తేలింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ యువరాజు, యజమాని హరికృష్ణారెడ్డి పరారీలో ఉండగా.. పోలీసులు వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన 28 మంది ప్రయాణికులు మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

# పొంగులేటి అక్రమాలపై ‘హౌస్ కమిటీ’ వేయాల్సిందే

- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్
- సీఐడీ విచారణతో న్యాయం జరగదు..
- కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలి
- ప్రశ్నిస్తే కేసులతో గొంతు నొక్కుతారా?
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతల ధ్వజం



**హైదరాబాద్, ఏప్రిల్1:** రాష్ట్రంలో జరుగుతున్న మైనింగ్ స్కామ్‌పై ప్రభుత్వం సీఐడీ విచారణ పేరుతో కాలయాపన చేస్తోందని, దీనిపై తక్షణమే ‘హౌస్ కమిటీ’ వేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో కోరుట్ల ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో మాజీ మంత్రి హరీశ్‌రావు మైనింగ్ అక్రమాలను ఆధారాలతో సహా బయటపెట్టినా ప్రభుత్వం స్పందించకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై సీఐడీ విచారణ వేస్తే న్యాయం ఎలా జరుగుతుందని కౌశిక్ రెడ్డి నిలదీశారు. “మంత్రి పదవిలో ఉన్న వ్యక్తిని సీఐడీ అధికారులు ప్రశ్నించగలరా? అందుకే ఆయన రాజీనామా చేయాలని మేం కోరుతున్నాం. నిజాలు తేలాలంటే సభా సంఘం వేయాల్సిందే” అని స్పష్టం చేశారు. అసెంబ్లీలో తాము నిరుద్యోగులు, పెన్షన్ల పక్షాన ప్రశ్నిస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఎథిక్స్ కమిటీకి కాంగ్రెస్ నేతలు వాడిన బూతులు వినిపించడం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన కడియం శ్రీహరి ప్రస్తుతం ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నారో స్పష్టం చేయాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. “అన్నం పెట్టిన కేసీఆర్‌ను విమర్శించడం కడియంకు తగదు. ఆయన బీఆర్ఎస్ సభ్యుడైతే మా వెనుకే కూర్చోవాలి కదా.. కాంగ్రెస్ వాళ్ల మధ్య ఎందుకు కూర్చున్నారు?” అని ప్రశ్నించారు. పార్టీ మారిన వ్యక్తిని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భుజాన ఎత్తుకోవడం సిగ్గుచేటన్నారు.

**అసెంబ్లీలో చర్చా స్థాయి దిగజారింది : ఎమ్మెల్యే సంజయ్**

కోరుట్ల ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్ మాట్లాడుతూ, అసెంబ్లీలో మంత్రులు సబ్జెక్ట్ వదిలేసి తోటి సభ్యులను తిట్టడానికే సమయం కేటాయిస్తున్నారని విమర్శించారు. స్వర్ణకారుల కష్టాలు, ప్రజా సమస్యల గురించి చర్చించకుండా కేవలం అవినీతి ఆరోపణలు ఉన్న మంత్రులను వెనకేసుకొస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ చర్చలు చూసి పిల్లలు నవ్వుకుంటున్నారని, ఇప్పటికైనా పాలసీల గురించి, రాజ్యాంగ విలువల గురించి చర్చించాలని సూచించారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా, కేసులు వేసినా ప్రజల పక్షాన పోరాటం ఆపేది లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు.

# అమరావతిపై చర్చలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలు

**నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ ఎంపీలు**

**తెలంగాణ విభజన హామీలు నెరవేర్చాలన్న ఎంపి వంశీ**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** ఏపీ అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ సందర్భంగా లోక్ సభలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమాకారులను కాంగ్రెస్ కాల్చిచంపిందని వ్యాఖ్యానించారు. చివరి దశ ఉద్యమంలో కూడా 1200 మంది ఆత్మబలిదానాలతో తెలంగాణ వచ్చిందన్నారు. కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ ప్రజలు రాష్ట్రాన్ని సాధించుకున్నారన్న కిషన్ రెడ్డి.. సుదీర్ఘ పోరాటంతో తెలంగాణ కల సాకారమైందన్నారు. అయితే గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశారని ఆరోపించారు. ఏపీలో ఏడు ఎయిర్ పోర్టులు ఉంటే.. తెలంగాణలో ఒక్కటే ఎయిర్ పోర్టు ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహార శైలితోనే తెలంగాణకు ఎయిర్ పోర్టులు రాలేదన్నారు. ఇప్పటికైనా తెలుగు రాష్ట్రాలు కలిసి అభివృద్ధిలో ముందుకెళ్లాలని సూచించారు. అన్నదమ్ముల్లాగా అభివృద్ధిలో ముందుకు సాగాలన్నారు. మోదీ అందిస్తున్న చేయత వల్ల తెలంగాణలో రైలు, రోడ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని అన్నారు. కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీలు అభ్యంతర తెలిపారు. కిషన్ రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలన్నారు. విభజన హామీలను కేంద్రం నెరవేర్చాలన్నారు. బీజేపీ ఇచ్చిన బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్నారు. అంతకు ముందు మాట్లాడిన పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ తెలంగాణకు కేంద్రం బకాయిలు చెల్లించాలన్నారు. ఏపీ చేపట్టిన బనకచర్లతో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తెలంగాణకు రావాల్సిన 200 టీఎంసీల నీళ్లు ఏపీ డైవర్ట్ చేస్తుందని ఆరోపించారు. బనకచర్లతో వందలాది ఎకరాలు నీట మునుగుతదన్నారు. తెలంగాణ కష్టాల మీద ప్రధాని మోదీ దృష్టిపెట్టాలన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్‌పోర్టు మంజూరు చేయాలని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్ పోర్టు కోసం రిక్వెస్ట్ చేశామన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్ పోర్టు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అంతర్గాం మండల కేంద్రంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం 591 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక అందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అక్కడ ఎయిర్ పోర్టు నిర్మాణం సాధ్యమవుతుందా అనే విషయమై ప్రీ ఫిజిబిలిటీ స్టడీ చేసేందుకు రూ.40.53 లక్షల ఫీజును ఎయిర్? పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు చెల్లిస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్? సెక్రటరీ వికాస్? రాజ్ గతేడాదిలో ఉత్తర్వులు జారీ చేశారు.

# మంగళ్‌హాట్ గోదాముపై దాడి

**హోటళ్లకు చచ్చిన మేకల మాంసం**

**కుళ్లిన పది టన్నుల మాంసం స్వాధీనం**



**హైదరాబాద్, ఏప్రిల్ 1:** హైదరాబాద్ నగరంలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మరో కల్తీ మాంసం ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు గోదాములపై మెరుపు దాడులు నిర్వహించి సుమారు 10 టన్నుల కుళ్లిన మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ టాస్క్‌ఫోర్స్, హెచ్–ఫాస్ట్, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళ్‌హాట్‌లోని గోదాములపై దాడులు నిర్వహించగా, నిల్వ ఉంచిన భారీ మొత్తంలో ఈ కుళ్లిన మాంసం బయటపడింది. ఈ దందా వెనుక అఫ్రోజ్ అనే వ్యక్తి కీలక సూత్రదారిగా వ్యవహరిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడు జమ్ముకశ్మీర్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి చనిపోయిన మేకలను తక్కువ ధరకు తెప్పించి, ఇక్కడ నిల్వచేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కుళ్లిన మాంసాన్ని నగరంలోని వివిధ హోటళ్లు, బిర్యానీ సెంటర్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు అఫ్రోజ్‌తో పాటు మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఈ ఘటనలో సదరు గోదాములను సీజ్ చేసిన అధికారులు.. నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల నగరంలో వరుసగా బయటపడుతున్న ఇలాంటి కల్తీ దందాల పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బయట ఆహారం తినేటప్పుడు, మాంసం కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# నేడు నగరంలో హనుమాన్ శోభాయాత్ర

**3వేల మందితో పోలీస్ బందోబస్తు**

**హైదరాబాద్, ఏప్రిల్ 1:** నగరంలో హనుమత్ జయంతికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇకపోతే గురువారం హనుమత్ జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. ఏప్రిల్ 2న హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించాక పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రధాన యాత్రలో సుమారు 168 శోభాయాత్రలు కలవనున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా సుమారు 3వేల మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. యాత్ర నిర్వహణలో వలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు. ఫ్లై ఓవర్లు, రైల్వే బ్రిడ్జిల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు మళ్లింపులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గౌలిగూడ రామమందిరాన్ని దర్శించుకున్న సీపీ సజ్జనార్ అక్కడి నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఉన్న 12 కిలోమీటర్ల శోభాయాత్ర మార్గాన్ని వాహనంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రోడ్లపై చెత్తాచెదారం, మట్టికుప్పలు, రాళ్లు లేకుండా, రోడ్డుపైకి వచ్చే చెట్టుకొమ్మలు తొలగించే పనులు చేస్తున్నారు. ప్రజలు శాంతియుతంగా యాత్ర జరిగేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ గురువారం 2 ఏప్రిల్ 2026



సంపాదకీయం

# ట్రంప్ చితిమంటల్లో ప్రపంచం విలవిల!

పశ్చిమాసియా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో అంతుచిక్కడం లేదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. అయితే ఈ యుద్ధం వల్ల ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతున్నా అగ్రరాజ్యం అమెరికా పట్టించుకోవడం లేదు. అమెరికా షరతులకు లొంగేది లేదని ఇరాన్ కరాఖండిగా చెప్పడంతో ఎటు వెళుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి ఇలాగే ఉంటే పశ్చిమాసియా సంక్షోభంతో ప్రపంచంలో తలెత్తే ఆర్థిక సమస్యల గురించి చర్చ మొదలైంది. నెల రోజులు దాటిన యుద్ధంతో చమురు నుంచి ఆహారం వరకు ప్రభావితం అవుతున్నాయి. అమెరికాకు మంగళవారం నాటి వరకు 36 బిలియన్ డాలర్లకు పైగా నష్టం జరిగింది. ప్రతి సెకనుకు 11,574 డాలర్లు ఖర్చు అవుతున్నాయి. ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికాలో గడచిన తొమ్మిది నెలల్లో మూడుసార్లు అక్కడి కార్మికవర్గం ప్రదర్శనలు చేశారు. ఎవరినైనా అదుపులోకి తెచ్చుకోవాలంటే అంతర్జాతీయ సూత్రాలను పక్కన పెట్టు, జనం మీద బాంబులు వేసి చంపు, దేశాలను నాశనం చేయి, అప్పుడు జనం నిరాశతో లొంగిపోతారనే అమెరికా అనుసరిస్తున్న విధానం ప్రపంచ దేశాలకు గుదిబండగా మారాయి. అమెరికా అడుగుజాడల్లో నడుస్తున్న ఇజ్రాయిల్ కూడా రెచ్చిపోవడం దారుణం. ఇదే క్రమంలో భారత ఆర్థిక వ్యవస్థ దిగజారుతుండటం ఆందోళనకరం. మన ఆర్థిక వ్యవస్థ త్వరలోనే ఐదు ట్రిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకుంటుందన్న మోడీ లక్ష్యానికి గండిపడినట్లే. ఎందుకంటే మన ఆర్థిక వ్యవస్థ కూడా ప్రపంచ దేశాల మీద ఆధారపడి నడుస్తోంది. దీనికితోడు చమరు దిగుమతులపై ప్రభావం కారణంగా దేశంలో ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా తయారయ్యింది. చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ 95కి పడిపోయింది. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చేనాటికి 2013లో డాలర్‌తో రూపాయి విలువ పోలిస్తే 62గా ఉండేది. రూపాయి విలువ అత్యంత ప్రమాదకర స్థాయికి చేరిందని అప్పట్లో నిర్మలా సీతారామన్, మోడీ విమర్శించారు. ఇప్పుడు అంతా బాగుందని పార్లమెంట్ సాక్షిగా ఆర్థిక మంత్రి ప్రకటించడం విడ్డూరం. డాలర్ పడిపోతున్న సమయంలో సైతం రూపాయి విలువ దిగజారడం, ఆసియా లోనే అత్యంత అధ్వాన స్థితికి చేరుకోవడం కేంద్రం వైఫల్యాన్ని చాటిచెప్పేదే. పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో ఆర్థిక సూచీల వృద్ధి మందగించిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తన తాజా నివేదికలో ప్రకటించింది. వాస్తవానికి యుద్ధం ప్రారంభానికి ముందే మన ఆర్థిక వ్యవస్థ ఆందోళనకర స్థితిలో ఉంది. దేశీయ ముడి చమురు పరిశ్రమ గత 24 నెలల్లో 20 నెలలు కుంచించుకుపోయింది. ప్రస్తుత ఎల్‌పిజి, పెట్రో ఉత్పత్తుల సంక్షోభానికి, తద్వారా ఆర్థిక రంగానికి ముప్పుగా పరిణమించిందనేది నిర్వివాదాంశం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రెండంకెల స్థాయిలో క్షీణిస్తున్నాయి. ఎగుమతులు గత కొన్ని నెలలుగా 5 శాతం నుండి 7 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేస్తున్నాయి. సరుకుల ఎగుమతులు 0.8 శాతం పతనమై 36.61 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. పశ్చిమాసియా సంక్షోభం, అమెరికా విధిస్తున్న కొత్త టారిఫ్‌లు భారత తయారీ రంగానికి, ముఖ్యంగా ఐటి, ఫార్మా ఎగుమతులకు గొడ్డలి పెట్టుగా మారాయి. ఉత్పత్తికి డిమాండ్ తగ్గిపోయిందని ఈ గణాంకాలన్నీ చెబుతూనే ఉన్నాయి. కేంద్రం చెబుతున్నట్టు 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశ జిడిపి కనీసం 8 నుండి 9 శాతం స్థిరమైన వృద్ధిని నమోదు చేయాలి. వాస్తవంగా 5 శాతానికి మించదనేది నిపుణుల వాదనగా ఉంది. స్టాక్ మార్కెట్‌కు ఈ యేడాది 'బ్లాక్ ఇయర్'గానే మిగిలిపోయింది. లక్షల కోట్ల సంపద ఆవిరైంది. విదేశీ పెట్టుబడిదారులు గత ఏడాది కాలంలో రూ.1.80 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకోవడం మార్కెట్లను అగాథంలోకి నెట్టేసింది. పశ్చిమాసియాలో అమెరికా- ఇజ్రాయిల్ రుద్దిన యుద్ధం మనదేశాన్ని గణనీయంగా దెబ్బతీసింది. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం సామాన్యుల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.2 శాతానికి ఎగిసి 10 నెలల గరిష్ట స్థాయికి చేరుకోవడం ప్రమాద ఘంటికగా చూడాలి. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ విద్యావం తులకు సరిపడా ఉద్యోగాలను సృష్టించలేక పోతోంది. ప్రభుత్వ విధానాలు కొన్ని కార్పొరేట్ సంస్థల లాభాలకూ, కుబేరుల సంపద పెరుగుదలకూ ఉపయోగపడుతున్నాయి. అసమానతలు తీవ్రమవుతున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు దారిద్ర్యంలోకి నెట్టబడుతున్నారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం, చిన్న పరిశ్రమలు కునారిల్లడం ఇందుకు నిదర్శనం. వాస్తవ సమస్యలను గుర్తించి పరిష్కరించినప్పుడే దేశానికి నిజమైన ఆర్థిక పురోగతి సాధ్యం. ఇరాన్‌పై దాడుల తరువాత అనేక దేశాల్లో స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. వాటి విలువ ఎంత అన్నది స్పష్టంగా చెప్పలేము. మన దేశంలో రూ.51 లక్షల కోట్లు నష్టపోయినట్లు అంచనా, ఇంకా పతనం కొనసాగితే నష్టాలు పెరుగుతాయి. ఈ ఏడాది చివరి నాటికి అమెరికా మాంద్యంలోకి వెళ్లేందుకు 37 శాతం అవకాశాలున్నట్లు పోలీ మార్కెట్ అంచనా వేసింది. కార్పొరేట్ కంపెనీలు పెరిగిన ఖర్చులను వినియోగదారుల మీద మోపితే ద్రవ్యోల్బణం పెరుగు తుంది, పెట్టుబడులు పెట్టేవారు ఆచితూచి అడుగేస్తారు, నియామకాలు తగ్గిపోతాయి. పశ్చిమాసియా సంక్షోభాన్ని ట్రంప్ ఎలా ముగిస్తాడో తెలియదు. స్వస్థి పలకటం అనివార్యం, అయితే అది అమెరికా నిర్దేశించినట్లు కాదు. ఇప్పుడు ఇరాన్ తన షరతులను ముందుకు తెస్తున్నది, ఇది ట్రంప్ కలలో కూడా ఊహించి ఉండదు.



# ఒరాకిల్ 'లేఆఫ్' బాంబు

- 30వేల మంది టెక్కీల తొలగింపు!
- అందులో 12 వేలమంది భారతీయులే..
- తెల్లవారుజామున 6 గంటలకే టర్మినేషన్ మెయిల్స్
- లాభాల్లో ఉన్నా ఖర్చుల కోత పేరిట వేటు
- ఐటీ లోకంలో తీవ్ర కలకలం

**న్యూయార్క్, ఏప్రిల్ 1 :** ప్రపంచ ప్రసిద్ధ సాఫ్ట్‌వేర్ దిగ్గజం 'ఒరాకిల్' ఐటీ రంగంలో పెను సంచలనం సృష్టించింది. సంస్థాగత పునర్వ్యవస్థీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన సిబ్బందిలో ఏకంగా 18 శాతం మందిని ఇంటికి పంపాలని నిర్ణయించింది. ఈ భారీ కోతలో భాగంగా దాదాపు 30,000 మంది ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోయారు. అత్యంత విచారకరమైన విషయం ఏంటంటే.. ఈ బాధితుల్లో సుమారు 12,000 మంది భారతీయులే ఉన్నట్లు సమాచారం.

## తెల్లవారకముందే చేదు వార్త..

అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం తెల్లవారుజామున 6 గంటలకే వేలాది మంది ఉద్యోగుల ఇన్-బాక్స్‌ల్లో 'టర్మినేషన్' మెయిల్స్ ప్రత్యక్షమయ్యాయి. ఎటువంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా, కనీసం మేనేజర్లు లేదా హెచ్ఆర్ విభాగం నుండి సమాచారం లేకుండానే ఈ మెయిల్స్ పంపడంపై ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. "మీ పాత్రతో ఇక కంపెనీకి అవసరం లేదు" అంటూ వచ్చిన ఒక్క మెయిల్‌తో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారి కెరీర్ ముగిసిపోయింది. మెయిల్ వచ్చిన వెంటనే కంపెనీ ల్యాప్‌టాప్‌లు, అంతర్గత వ్యవస్థల యాక్సెస్‌ను నిలిపివేయడం ఉద్యోగులను మరింత షాక్‌కు గురిచేసింది.

## లాభాల్లో ఉన్నా ఎందుకీ కోత?


ఒరాకిల్ ప్రస్తుతం ఆర్థికంగా పటిష్టంగానే ఉంది. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో సంస్థ లాభాలు 95 శాతం పెరిగి 6.13 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ డేటా సెంటర్ల రంగంలో 156 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులు పెట్టాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భారీ ప్రాజెక్టుల కోసం ఇప్పటికే 50 బిలియన్ డాలర్ల అప్పు తీసుకున్న ఒరాకిల్, నిర్వహణ ఖర్చులను తగ్గించుకునే క్రమంలోనే ఈ ఉద్యోగాల కోతకు పాల్పడినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నిర్ణయం ద్వారా ఏడాదికి 10 బిలియన్ డాలర్ల వరకు నగదు ఆదా చేయవచ్చని సంస్థ అంచనా.

## భారత్‌పై తీవ్ర ప్రభావం

ఒరాకిల్ ఇండియాలో సుమారు 30,000 మంది పని చేస్తుండగా, అందులో దాదాపు 40 శాతం మంది ఈ లేఆఫ్స్ బారిన పడ్డారు. ముఖ్యంగా అమెరికా, కెనడా వంటి దేశాల్లో కఠినమైన కార్మిక చట్టాల దృష్ట్యా, ఖర్చు తక్కువగా ఉండే భారతీయ విభాగాలపైనే మేనేజ్‌మెంట్ ఎక్కువ వేటు వేసినట్లు తెలుస్తోంది. మేనేజీరియల్ స్థాయి నుంచి ఇంజనీర్ల వరకు ఈ జాబితాలో ఉన్నారు.

## పరిహారం షరతులతోనే..

తొలగించిన ఉద్యోగులకు మూడు నెలల అదనపు జీతం, సర్వీసులో ఉన్న ప్రతి ఏడాదికి 15 రోజుల జీతం వంటి ప్రయోజనాలను కంపెనీ ప్రకటించింది. అయితే,




ఈ ప్యాకేజీ అందరికీ వర్తించదు. కంపెనీ నిర్ణయించిన గడువులోగా 'సామరస్యపూర్వకంగా' రాజీనామా చేసిన వారికి మాత్రమే ఈ ప్రయోజనాలు అందుతాయని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ భారీ లేఆఫ్స్ కేవలం మొదటి విడత మాత్రమేనని, రానున్న నెల రోజుల్లో మరిన్ని కోతలు ఉండవచ్చనే వార్తలు ఇప్పుడు ఐటీ వర్గాల్లో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

# ఇరాన్‌పై 800 సార్లు యుద్ధ విమానాల దాడి

- 16వేలకు పైగా బాంబులు వేసిన ఫైటర్లు
- వెల్లడించిన ఇజ్రాయిల్ మిలిటరీ శాఖ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** దాదాపు నెల రోజులకు పైగా ఇరాన్, దాని మిత్ర దేశాలపై అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఈ దాడులకు సంబంధించిన వివరాలను తాజాగా ఐడీఎఫ్ పంచుకుంది. యుద్ధం ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 800 సార్లు తమ యుద్ధ విమానాలు ఇరాన్ పైకి దూసుకెళ్లాయని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఫైటర్‌జెట్లు 16వేలకు పైగా బాంబులను జారవిడిచినట్లు తెలిపింది. ఇరాన్ ప్రముఖ నాయకులు, మిలిటరీ కమాండర్లు, హెడ్‌క్వార్టర్లు, అణు స్థావరాలు, ఆయుధ తయారీ కేంద్రాలు, బాలిస్టిక్ క్షిపణి లాంచర్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేశాం. యుద్ధం మొదలైన నాటినుంచి 4వేల లక్ష్యాలపై 10వేలకు పైగా దాడులు చేశాం. దాదాపు 16వేల బాంబులను జారవిడిచాం. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన 2వేల మందికి పైగా సైనికులు, కమాండర్లు హతమయ్యారు. కేవలం 40 సెకన్లలోనే 40 మందికి పైగా సీనియర్ అధికారులను అంతమొందించాం అని ఐడీఎఫ్ వెల్లడించింది. మరో 5వేల కొత్త టార్గెట్లను కూడా గుర్తించినట్లు తెలిపింది. ఇరాన్, దాని అనుబంధ



గ్రూప్‌లు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నాయని, వాటిని అడ్డుకోవడమే తమ లక్ష్యమని ఐడీఎఫ్ పునరుద్ఘాటించింది. మరోవైపు అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా యుద్ధంపై స్పందించింది. ఇరాన్‌లోని భూగర్భ లక్ష్యాలను కూడా ఛేదించినట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను తాజాగా విడుదల చేసింది.

# యుద్ధం ముగింపునకు సిద్ధమే

## షరతులు వర్తిస్తాయన్న ఇరాన్

**టెహ్రాన్, ఏప్రిల్ 1:** అమెరికా- ఇజ్రాయెల్‌తో కొనసాగుతోన్న యుద్ధాన్ని ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పేర్కొన్నారు. అయితే, తమకు కొన్ని బలమైన హామీలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. యుద్ధం ముగించాలంటే తాము విధించిన షరతులకు అంగీకరించాలని ఇరాన్ అధ్యక్షుడు పేర్కొన్నారు. ముఖ్యంగా భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కావనే బలమైన హామీ ఇవ్వాలన్నారు. అప్పుడు ఈ యుద్ధం ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇరాన్ అధ్యక్షుడితో జరిగిన సంభాషణ తర్వాత ఆంటోనియో కోస్టా సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులను తగ్గించుకోవాలని కోరారు. దౌత్య మార్గాలతో సమస్యను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం గురించి ప్రస్తావించారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ నుంచి తనకు నేరుగా సందేశాలు అందుతున్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. అయితే, ఆ దేశంతో చర్చలు జరుపుతున్నామనేది దాని ఉద్దేశం కాదన్నారు. మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని సందేశాలు మధ్యవర్తుల ద్వారా కూడా వచ్చాయన్నారు. యూఎస్‌తో తాము ఎలాంటి అధికారిక చర్చలు జరపడం లేదని.. ఆ దేశం చేసిన ప్రతిపాదనలపై తాము ఇంకా స్పందించలేదని వెల్లడించారు. కాల్పుల విరమణకు తాము అంగీకరించమని.. యుద్ధం ముగింపును మాత్రమే తాము కోరుకుంటున్నామని అరాగ్చీ స్పష్టం చేశారు.



# నాటో నుంచి తప్పుకుంటాం

- అది 'కాగితపు పులి' కూటమి..
- ఇరాన్ యుద్ధంలో మిత్రదేశాల సహకారం సున్నా.. అందుకే ఈ ఆలోచన
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలనం
- బ్రిటన్ నౌకాదళంపై ఎద్దేవా..
- ట్రంప్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన కీర్ స్టార్మర్



**వాషింగ్టన్/లండన్, ఏప్రిల్ 1:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంతర్జాతీయ వేదికపై మరోసారి బాంబు పేల్చారు. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సైనిక కూటమిగా భావించే నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) నుంచి అమెరికా వైదొలిగే అంశాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. నాటో కూటమిని ఒక 'కాగితపు పులి'గా అభివర్ణించిన ట్రంప్, దాని విశ్వసనీయతపై తనకు ఎప్పటి నుంచో అనుమానాలు ఉన్నాయని స్పష్టం చేశారు. బ్రిటన్‌కు చెందిన ఒక ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ తన అసహనాన్ని వెళ్లగక్కారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ జరిపే సైనిక చర్యల్లో నాటో దేశాలు తమకు అండగా నిలవడంలో విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు. "కష్టకాలంలో సహకరించని మిత్రదేశాల కూటమిలో కొనసాగడం వల్ల ప్రయోజనం లేదు. ఇరాన్ విషయంలో వాళ్లు మాకు మద్దతు ఇవ్వడం లేదు, అందుకే నాటో నుంచి వైదొలిగే ఆలోచన చేస్తున్నాం" అని ట్రంప్ కుండబద్దలు కొట్టారు.

## బ్రిటన్ నేవీపై విమర్శలు..

ఇదే క్రమంలో బ్రిటన్ యుద్ధ నౌకల దుస్థితిని ట్రంప్ నేరుగా ఎద్దేవా చేశారు. "మీకు అసలు నావికాదళమే లేదు. ఉన్నవన్నీ చాలా పాతబడిపోయాయి. మీ వద్ద ఉన్న విమాన వాహక నౌకలు కూడా పనిచేయని స్థితిలో ఉన్నాయి" అంటూ విమర్శలు గుప్పించారు. రక్షణ వ్యయంపై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌కు ఏమైనా సలహా ఇస్తారా అని ప్రశ్నించగా.. "నేను ఎవరికీ సలహాలు ఇవ్వను, ఆయనకు నచ్చింది ఆయన చేసుకోవచ్చు" అని పొడిగా సమాధానమిచ్చారు.

## స్టార్మర్ దీటైన జవాబు..

ట్రంప్ వ్యాఖ్యలపై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ వెంటనే స్పందించారు. నాటో అనేది ప్రపంచం చూసిన అత్యంత సమర్థవంతమైన సైనిక కూటమి అని, దానికి బ్రిటన్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. "నాపై, ఇతర దేశాలపై ఒత్తిడి ఉన్న మాట వాస్తవమే, కానీ నేను తీసుకునే ఏ నిర్ణయమైనా బ్రిటన్ జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే ఉంటుంది" అని స్టార్మర్ స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో పెను కలకలం రేపుతున్నాయి. ఒకవేళ అమెరికా నిజంగానే నాటో నుంచి తప్పుకుంటే, ప్రపంచ భద్రతా ముఖచిత్రం పూర్తిగా మారిపోయే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.






# మెట్‌పల్లి సర్కారీ దవాఖానలో ఘోరం

## పురిట్లోనే శిశువు చేయి విరగ్గొట్టిన డాక్టరమ్మ!

### పుట్టిన కొద్దిసేపట్లోనే శిశువు చేతికి వాపు

- సిజేరియన్ చేస్తుండగా వైద్యురాలి నిర్లక్ష్యం.. బంధువుల తీవ్ర ఆగ్రహం
- ఎక్స్‌రేలో ఫ్రాక్చర్ నిర్ధారణ.. ఒత్తిడి వల్లేనంటున్న గైనకాలజిస్ట్ మాధవి
- సదరు డాక్టరు తీరుపై విచారణకు బాధితుల డిమాండ్




**“అత్త మీది కోపం.. దుత్త మీద తీసింద్రటాని పల్లెటూరి సామెత.! ఇక్కడ కూడా సరిగ్గా అలానే.. ఓ సర్కారి డాక్టరమ్మ మనసులో ఏంబెట్టుకుని గర్భిణీకి సిజేరియన్ చేసిందో? నవజాత శిశువు చేయి విరగ్గొట్టేసింది.! మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఈ ఘటన చూపరుల గుండెల్ని పిండేస్తోంది.! ‘సురక్షిత ప్రసవం’ కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లిన గర్భిణికి సిజేరియన్ చేయగా, పుట్టిన కొద్ది సేపటికే నవజాత శిశువు చేయి విరిగినట్లు బయటపడటం కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన వైద్యులు నిర్లక్ష్యం వహించారని బంధువులు ఆరోపిస్తుండగా, మరోవైపు ఇది సాధారణ వైద్య సమస్యగా వైద్యులు చెప్పడం వివాదానికి దారితీసింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.!”**

**- నేటి సాక్షి, మెట్‌పల్లి(రాధారపు నర్సయ్య)**

### ప్రసవం తర్వాత బంధువులు షాక్!

మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని వెంకట్రావ్‌పేట కాలనీకి చెందిన కొడిగంటి భవాని అనే గర్భిణిని నెలలు నిండడంతో మార్చి 29న కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అదే రోజు వైద్యులు సిజేరియన్ ఆపరేషన్ చేసి శిశువును బయటకు తీశారు. అయితే కొద్దిసేపటికే శిశువు చేతికి వాపు కనిపించడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు.



### ఎక్స్‌రేలో బయటపడిన నిజం

శిశువు చేయికి కొద్ది నిమిషాల్లోనే వాపు రావడాన్ని గమనించిన బంధువులు వెంటనే ‘సిజేరియన్ ఆపరేషన్’ చేసిన వైద్యురాలు మాధవి దగ్గరకు వెళ్లి ఆమెని నిలదీశారు. బదులుగా ఆమె నిర్లక్ష్యంగా.. కూల్ గా శిశువును వెంటనే ఎముకల ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలిపారు. అక్కడ ఎక్స్రే తీయగా శిశువు చేయి విరిగినట్లు నిర్ధారణ కావడంతో కుటుంబ సభ్యులు షాక్‌కు గురయ్యారు.

### సిజేరియన్‌ఎలా అయితది: తండ్రి ఆగ్రహం

శిశువు తండ్రి ఉదయ్ ఆగ్రహంగా మాట్లాడుతూ.. ‘నార్మల్ డెలివరీలో అయితే ఏదైనా ప్రమాదం జరిగి ఉంటుందని అనుకోవచ్చు.! కానీ.. నా భార్యకు సిజేరియన్ చేసి శిశువును బయటకు తీసిన తర్వాత చేయి విరగడం ఏంటీ?’ అని ప్రశ్నించారు. ఇది పూర్తిగా వైద్యుల నిర్లక్ష్యమేనని ఆరోపించారు. ఆపరేషన్‌ను నర్సులతో..సీనియర్ సిబ్బందితో చేయించారని తమకు అనుమానం ఉందని, దీనికి పూర్తి బాధ్యత ఆసుపత్రి వైద్యులదేనని స్పష్టం చేశారు.శిశువు చేయి విరగడమే కాకుండా తలపై కూడా చిన్నపాటి గాయాలు ఉన్నాయని, ఇలాంటి పరిస్థితిలో శిశువు భవిష్యత్తు ఏంటని ప్రశ్నించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని శిశువు తండ్రి ఉదయ్ డిమాండ్ చేశారు.

### ‘ఒత్తిడితో జరిగి ఉండొచ్చు.. లేదా చేతి వేళ్లు తగిలి ఉండొచ్చు.!

**(సిజేరియన్ చేసిన వైద్యురాలు మాధవి వివరణ)**

ఈ ఘటనపై గైనకాలజిస్ట్.. సిజేరియన్ చేసిన వైద్యురాలు మాధవి మీడియాతో మాట్లాడుతూ.. శిశువు తల్లి భవాని ఆదివారం డెలివరీ కోసం ఆసుపత్రికి వచ్చిందని, సిజేరియన్ అవసరమైందని తెలిపారు. శిశువు తల్లి గర్భంలో చేతులు లోపలికి ఉండటంతో ఒకచేతిని బయటకు తీసే సమయంలో మరో చేయి లోపలికి అతుక్కుపోయిందని, దాన్ని అతి క్లిష్టంగా బయటకు తీయాల్సి వచ్చిందన్నారు. ఆ సమయంలో కండరాల ఒత్తిడితో లేదా డెలివరీ ప్రక్రియలోనే చేయి విరిగి ఉండొచ్చని పేర్కొన్నారు. తలకు తగిలిన గాయాలు కత్తి, కత్తెర వల్ల కాకుండా చేతివేళ్లు తాకడం వల్ల జరిగి ఉండవచ్చని, అలాంటి గాయాలు ఇలాంటి ప్రక్రియలో సర్వ సాధారణమని తెలిపారు. శిశువు చేతికి వాపు గమనించగానే అటెండర్లను పిలిచి వెంటనే ‘చిల్డ్రన్స్ హాస్పిటల్’కు తీసుకెళ్లాలని సూచించినట్లు వైద్యురాలు పేర్కొన్నారు. గాయాలు పది రోజుల్లో తగ్గిపోతాయని చెప్పారు.

### డాక్టరమ్మపై ఆరోపణల గుసగుసలు!

ఇదిలా ఉండగా, సంబంధిత వైద్యురాలిపై స్థానికంగా పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆమెకు ప్రైవేట్ నర్సింగ్ హోమ్



ఉండి, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులను అక్కడికి మళ్లించాలని ప్రయత్నిస్తుందని ప్రచారం జరుగుతోంది. భవానిని కూడా తన ఆసుపత్రికి రమ్మని సూచించిందని, వారు నిరాకరించడంతో నిర్లక్ష్యంగా వ్యవహరించి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### సమయపాలన లేకపోవడంపై ఆరోపణల వెల్లువ

అదే విధంగా, ప్రభుత్వ ఆసుపత్రి విధులకు సరిగా హాజరుకావడం లేదని, సమయపాలన పాటించడం లేదని ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం. ఈ విషయమై వైద్యారోగ్య శాఖ అధికారులు పలుమార్లు మందలించినట్లు కూడా ప్రచారం జరుగుతోంది.

### డాక్టరమ్మకు ముక్కుమీదనే కోపముంటదట!

కొందరు పోలీసుల మాటల్లో చెప్పాలంటే.. డాక్టరమ్మకు ముక్కుమీదనే కోపం ఉంటదని అంటున్నారు. తన ఇంటికి దగ్గరలో స్థానిక పోలీసులు రెగ్యులర్ గా వాహన తనిఖీలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఆమె తరచూ వాహన తనిఖీల సమయంలో పోలీసులతో వాగ్వాదాలకు దిగుతుందని స్వయంగా పోలీసులే పేర్కొంటుండడం గమనార్హం. ఓ డాక్టర్ అయ్యి ఉ ండి.. బాధ్యత లేకుండా హెల్మెట్ లేకుండా ఎలా డ్రైవింగ్ చేస్తావ్? ప్రాణం విలువ అందరికంటే మీకే ఎక్కువ తెలుస్తుందని పోలీసులు పేర్కొంటే? మాకేనా మీరు చెప్పేది.. అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ వెళ్లిపోతారని వారి వాదన. డాక్టర్ మాధవికి ఆగ్రహ స్వభావం ఎక్కువగా ఉంటుందని కూడా ఇంకొన్ని వర్గాలు చెబుతున్నాయి. ఈ అంశాలు ఇప్పుడు బయటకు రావడంతో ప్రజల్లో అనుమానాలు మరింత పెరుగుతున్నాయి.

### ప్రజల్లో ఆగ్రహం -- చర్యల డిమాండ్

‘అభం-శుభం’ తెలియని ఓ నవజాత శిశువు పురిట్లోనే ఇలాంటి దుస్థితిని ఎదుర్కోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా జరిగిన ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### వ్యవస్థపై ప్రశ్నలు -- బాధ్యత ఎవరిది?

ఈ ఘటనతో ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవల నాణ్యత, పర్యవేక్షణ, బాధ్యతపై మళ్లీ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒక వైపు వైద్యులు పరిస్థితులను కారణంగా చూపుతుండగా, మరోవైపు బాధితులు నిర్లక్ష్యమే కారణమంటున్నారు. నిజానిజాలు బయటపడేందుకు సమగ్ర విచారణ అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ‘హృదయవిదారక’ ఘటన మెట్ పల్లి పట్టణంలో చర్చానీయాంశమైంది!





నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్
గురువారం
2 ఏప్రిల్ 2026



# జై భజరంగ్ బలి!!

## చూడముచ్చటైన 'కొండగట్టు' అంజన్న గుట్టందాలు

- మహిమాన్వితం స్థలపురాణం
- గుట్టపైన ఆంజనేయుడు-గుట్టకింద భేతాళుడు
- పరవశింప జేసే ప్రకృతి సోయగాలు
- నేటి నుంచి కొండగట్టులో అంజన్న జయంత్యుత్సవాలు

"తెలంగాణలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం ఒకటి.! కలియుగ ప్రత్యక్ష దైవంగా విరాజిల్లుతున్న కొండగట్టుపై నిద్ర చేస్తే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం.! నిత్యం వేలాది మంది భక్తులు దర్శించుకుంటుంటారు.కాగా.. 'కొండగట్టు' గుట్ట పచ్చని చెట్లు..చుట్టూ అల్లుకున్న తీగలతో చూడముచ్చటగా ఉంటుంది. మహిమాన్విత ఈ పుణ్యక్షేత్రానికి ఆసక్తికరమైన 'స్థల పురాణామూ'.. ఉందంటారు. గుట్టపైన 'వెజిటేరియన్' ఆంజనేయుడు పూజలందుకుంటుంటే.. గుట్ట కింద 'నాన్ వెజ్'తో భేతాళుడు మొక్కులు చెల్లించుంటున్నాడు.! ఆంజనేయస్వామి పుట్టినరోజు సందర్భంగా నేటి నుంచి కొండగట్టులో చిన్న జయంతోత్సవాలు చూడముచ్చటగా జరుగుతుంటాయి.!"

- నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో ( రాధారపు నర్సయ్య )









### ఇంతకీ ఇదెక్కడుందంటే.!

జగిత్యాల జిల్లాలోని మల్యాల మండల కేంద్రంలోని ముత్యంపేట గ్రామానికి దాదాపు 5 కిలోమీటర్ల దూరాన గుట్టపైన ఈ ఆంజనేయ స్వామి దేవాలయం ఉంది. జీవితంలో ప్రతీ ఒక్కరూ ఒక్కసారైనా దర్శించుకోవాల్సిన దేవాలయం ఇది అంటారు. ఇక్కడ నల్లని బండల నడుమ ఒక 'ధర్మ గుండం' ఉంది. దీంట్లో అన్ని కాలాల్లోనూ నీరు ఉండటం ఒక ప్రత్యేకతగా చెబుతుంటారు. ఇది జిల్లాలో జగిత్యాల నుండి 15 కిలోమీటర్ల దూరలో ఉంది. కొండలూ.. లోయలూ.. సెలయేరుల మధ్యన ఉన్న కొండగట్టు చాలా ప్రకృతి సౌందర్యం కలిగిన ప్రదేశం. ఈ గుడిలో 41 రోజు పాటు పూజ చేస్తే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం.

### ప్రతీ యేటా ప్రత్యేక పూజలు

ఆలయంలో నిర్వహించే ప్రధాన పర్వదినాలు..ఏటా చైత్ర పౌర్ణమిరోజు 'చిన్న హనుమాన్' జయంతి. వైశాఖ బహుళదశమినాడు వచ్చే 'పెద్ద హనుమాన్' జయంతి ని ఘనంగా నిర్వహిస్తారు.

### హనుమాన్ దీక్షలు-ముడుపులు-మొక్కులు

ఈ సందర్భంగా లక్షలాది దీక్షాపరులు అంజన్నను దర్శించుకొని ముడుపులు కట్టి వెళ్తుంటారు. పెద్ద హన్మాన్ జయంతి సందర్భంగా మూడు రోజుల పాటు హోమం నిర్వహిస్తారు.'ఉగాది' పండుగ రోజు స్వామివారి సన్నిధిలో 'పంచాంగ శ్రవణం' జరుగుతుంది. చైత్ర శుద్ధనవమి రోజు 'శ్రీరామనవమి' సందర్భంగా 'శ్రీ సీతారాముల కల్యాణం' కన్నుల పండువగా జరుగుతుంది.'శ్రావణ మాసం'లో సప్తాహ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఏటా 'ధనుర్మాస' ఉత్సవాల్లో భాగంగా నెల రోజులపాటు తిరుప్పావై, గోదా రంగనాయకుల కళ్యాణం జరుగుతుంది. వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు స్వామివారి దర్శనం గావిస్తారు. దీపావళి పర్వదినం సందర్భంగా సహస్ర దీపాలంకరణతో ఆలయాన్ని తీర్చిదిద్దుతారు. ఆలయ పవిత్రతతో పాటు లోకకళ్యాణం నిమిత్తం ఏటా పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ప్రపంచ శాంతికోసం జగత్ కళ్యాణ సిద్ధికి ఏటా మూడు రోజులపాటు శ్రీ సుదర్శన మహాయాగం జరుపుతారు.

### గుట్ట కింద భేతాళుడు

కొండగట్టు ఆంజనేయ స్వామి క్షేత్ర పాలకుడిగా 'బేతాళ స్వామి' ఆలయం కొండకింద నెలకొని ఉంది.గుట్ట పైన ఆంజనేయ స్వామి 'వెజిటేరియన్' పూజలందుకుంటుండగా.. గుట్ట కింద 'భేతాల



స్వామి' కోళ్ళు.. మేకలు.. గొర్రెలతో..'నాన్ వెజ్'తో పూజలందుకుంటున్నాడు.ఇక్కడ నిత్యం వేలాది మంది 'మందు-విందు'లతో ఎంజాయ్ చేస్తూ భార్యాపిల్లలతో సంబరాలు చేసుకుంటుంటారు. సో.. భక్తులు 'కొండగట్టు అంజన్న' దర్శనానికి దారిపట్టండి మరి.. జై భజరంగ్ భళీ.!!


### మరి..స్థల పురాణం..ఏంటంటే.?

సుమారు 400 ఏళ్ల క్రితం కొడిమ్యాల పరిసర ప్రాంతాల్లో సింగం సంజీవుడు అనే వ్యక్తి ఆవులు మేపుతూ.. ఈ కొండ ప్రాంతానికి వచ్చాడుట. ఆ ఆవుల మందలోని ఒక ఆవు తప్పి పోయిందిట. సంజీవుడు వెతకగా పక్కన ఒక పెద్ద చింతచెట్టు కనబడగా, సేద తీరడనికై ఆ చెట్టు కింద నిద్ర పోయాడుట. అతని కలలో ఆంజనేయ స్వామి వారు కనిపించి, నేనిక్కడ కోరంత పొదలో ఉన్నాను..నాకు ఎండా-వాన- ముండ్ల నుండి రక్షణ కల్పించు.! తప్పిపోయిన నీ ఆవు జాడ అదిగో..'అని చెప్పి అదృశ్యమయ్యాడుట. వెంటనే.. ఆయన కళు తెరచి చూడగా ఆవు కనిపించడంతో సంజీవుని ఆనందానికి అవధుల్లేకుండా పోయాయిట. అక్కడ పరిసర ప్రాంతాలన్ని వెతికి పొదను తొలగించగా.. 'శంఖు చక్ర గదాలంకరణ'తో శ్రీ ఆంజనేయ స్వామి విశ్వరూపమైన పంచముఖాలలో ఒకటైన నారసింహ వస్త్రంతో ఉత్తరాభి ముఖంగా ఉన్న రూపాన్ని చూసి ముగ్ధుడయ్యాడుట. వెంటనే స్వామి వారికి చిన్న ఆలయాన్ని నిర్మించాడుట. కొండగట్టు ఆంజనేయస్వామి వారికి స్వయంగా నారసింహ వస్త్రం, శంఖం, చక్రం, వక్ష స్థలంలో రాముడు, సీతలతో కలిగిన స్వరూపం కలిగి ఉండటం విశేషం. నారసింహ వస్త్రంతో వెలసిన కొండగట్టు అంజన్న ఆలయానికి ఈశాన్య భాగంలోని గుహల్లో మునులు తపస్సు ఆచరించినట్లు ఆనవాళ్లున్నాయి. శ్రీరాముడు సీతకోసం లంకకు వెళ్లే సమయంలో లక్ష్మణుడు మూర్ఛిల్లిపోగా ఆంజనేయుడు సంజీవని పర్వతాన్ని తీసుకొని వస్తుండగా అందులోంచి ఓ ముక్కరాలిపడి కొండగట్టుగా ప్రసిద్ధి పొందిందని మరికొందరు పురాణగాథను చెబుతుంటారు. ఆలయానికి వెళ్లే దారిపక్కన సీతాదేవి ఏడ్చినట్లు చెప్పే కన్నీటి గుంతలు భక్తులకు దర్శనమిస్తాయి. ప్రకృతి సిద్ధంగా వెలసిన పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరిస్తే పాపాలు తొలగిపోతాయని విశ్వసిస్తారు. రోగగ్రస్థులు, సంతానహీనులు అంజన్న సన్నిధిలో 41 రోజులు గడిపితే బాగవుతారని భక్తుల విశ్వాసం.

### ఇదీ.. కొండగట్టు అంజన్న చరిత్ర..!!

ఇది రామాయణం కాలం నాటి మాట. రామ - రావణ యుద్ధం జరుగుతున్నప్పుడు లక్ష్మణుడు మూర్ఛపోతాడు. అప్పుడు సంజీవనిని తెచ్చేందుకు అంజనేయస్వామి బయలుదేరుతాడు. అతడు సంజీవనిని తీసుకు వచ్చేటపుడు ముత్యంపేట మార్గాన కొంతభాగం విరిగి పడుతుందట. ఆ భాగాన్నే 'కొండగట్టు'గా గల పర్వత భాగంగా పిలుస్తున్నారు.







## ఐపీఎల్ పాస్‌లు, టికెట్ల బ్లాక్ మార్కెటింగ్‌పై

# ఈడీకి టీసీఏ ఫిర్యాదు

**హెచ్‌సీఏ ఖాతాలు, లావాదేవీలను పరిశీలించాలని వినతి**

**హైదరాబాద్:** ఐపీఎల్ పాస్ లు, టికెట్ల బ్లాక్ మార్కెటింగ్ పై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఈడీ కి ఫిర్యాదు చేసింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పెద్దలు.. ఐపీఎల్ టికెట్లు, పాస్ లు బ్లాక్ మార్కెట్ వైపు మళ్లించారని.. కోట్ల రూపాయలు కొల్లగొట్టేందుకు యత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. గత 10 ఏళ్లలో దాదాపు 600 కోట్ల వరకు అవినీతి జరిగిందని.. హెచ్‌సీఏ ఖాతాలు, లావాదేవీలను పరిశీలించాలని కోరింది. ప్రభుత్వ సంస్థల క్రికెట్ క్లబ్ లను ఒక్కొకటి 2 నుంచి 2.5 కోట్లకు ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకున్నారని ఫిర్యాదులో పేర్కొంది. నిధుల దుర్వినియోగం, ఫోర్జరీ, తప్పుడు ఖాతాల నమోదు, నకిలీ పత్రాలతో పెద్ద ఎత్తున స్కాం లు జరిగాయని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఫిర్యాదు లో పేర్కొన్నది. జీహెచ్ఎంసీ/ఎంసీహెచ్‌కి చెందిన 17 క్రికెట్ క్లబ్‌లను అక్రమంగా ప్రైవేటీకరించి, ప్రతి క్లబ్‌ను.. ప్రైవేట్ వ్యక్తులకు బదిలీ చేశారని ఆరోపించింది. 103 ఒరిజినల్ క్లబ్ లను మాయం చేసి.. 80 కి పైగా నకిలీ క్లబ్ లను హెచ్‌సీఏలో చేర్చారని ఫిర్యాదులో పేర్కొంది.


diversion of institutional funds, causing wrongful loss to HCA and unlawful gain to private individuals and persons in control of HCA. The said amount is public accountable money and must be recovered by attaching properties and freezing bank accounts of those responsible.

**(C) Illegal Privatization / Sale of Government GHMC/MCH Clubs:**
It is reliably represented that 17 GHMC/MCH cricket clubs, which are public Government/municipal assets meant for public sports development, were illegally privatized/handed over/sold to private individuals by HCA office bearers in collusion with private persons. Such acts amount to illegal alienation of Government property and unlawful occupation of public assets.

**(D) Membership Fraud and Vote Manipulation:**
HCA has allegedly:
- caused disappearance of 103 genuine member clubs,
- illegally added 80+ fraudulent clubs,
- Manipulated voter lists and election process

# ప్రియ ముందంజ

**ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్**

**ఉలన్‌బాతర్(మంగోలియా):** ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల మెరుగైన ప్రదర్శన కొనసాగుతున్నది. పోటీల రెండో రోజైన మంగళవారం జరిగిన మహిళల 60కిలోల బౌట్‌లో ప్రియ 5–0 తేడాతో రిమ్మా వోలెసెంకో(కజకిస్థాన్)పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన ప్రియ... పవర్‌ఫుల్ పంచ్‌లతో విరుచుకుపడుతూనే మరోవైపు ప్రత్యర్థికి దీటుగా బదులిస్తూ ముందుకు సాగింది. మరోవైపు పురుషుల 55కిలోల బౌట్‌లో జాదుమణిసింగ్ 2–3 తేడాతో రిమా యమగుచి(జపాన్)పై పోరాడి ఓటమిపాలయ్యాడు. ఈ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ బాక్సర్‌గా కొనసాగుతున్న యమగుచికి జాదుమణి దీటైన పోటీనిచ్చాడు.



# ఢిల్లీ క్యాపిటల్స్ 'సూపర్' విక్టరీ!

## ఆరు వికెట్ల తేడాతో లక్నోపై ఘన విజయం..

**బౌలింగ్‌లో నటరాజన్, ఎంగిడి..**
**బ్యాటింగ్‌లో సమీర్ రిజ్వీ, అదుర్స్**






**ఢిల్లీ :** ఉత్కంఠభరిత మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ పై ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బౌలర్ల విజృంభణకు తోడు బ్యాటర్లు సమిష్టిగా రాణించడంతో లక్నో పెట్టిన మోస్తరు లక్ష్యాన్ని ఢిల్లీ సునాయాసంగా ఛేదించింది. పదిహేడు బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని తమ ఖాతాలో వేసుకుని సత్తా చాటింది. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ సారథి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లు.. ఢిల్లీ బౌలర్ల ధాటికి పెవిలియన్ కు క్యూ కట్టారు. అబ్దుల్ సమద్, (25 బంతుల్లో 36 పరుగులు).. మిచెల్ మార్ష్, (28 బంతుల్లో 35 పరుగులు) కాస్త పోరాడినప్పటికీ మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో లక్నో జట్టు తక్కువ స్కోరుకే పరిమితమైంది. షాబాజ్ అహ్మద్, 16 బంతుల్లో 15 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇరవై ఓవర్లు కూడా పూర్తి చేయకుండానే.. 18.4 ఓవర్లలో 141 పరుగులకే లక్నో జట్టు ఆలౌట్ అయ్యింది.

**ఢిల్లీ బౌలర్ల మాయాజాలం..**

లక్నో పతనాన్ని శాసించడంలో ఢిల్లీ బౌలర్లు కీలక పాత్ర పోషించారు. పేసర్ లుంగి ఎంగిడి, కేవలం 3.4 ఓవర్లు వేసి 27 పరుగులిచ్చి మూడు కీలక వికెట్లు పడగొట్టాడు. మన తెలుగోడు నటరాజన్, కూడా నాలుగు ఓవర్లలో 29 పరుగులు మాత్రమే ఇచ్చి మూడు వికెట్లు తీసి లక్నో నడ్డివిరిచాడు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, రెండు వికెట్లు తీసి ప్రత్యర్థిని మరింత కష్టాల్లోకి నెట్టాడు.

**సమీర్ రిజ్వీ, ఒంటిచేత్తో..**

142 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఆదిలోనే తడబాటు ఎదురైనా.. ఆ తర్వాత నిలకడగా ఆడి విజయం సాధించింది. ముఖ్యంగా యువ బ్యాటర్ సమీర్ రిజ్వీ, అద్భుతమైన బ్యాటింగ్ తో ఆకట్టుకున్నాడు. 47 బంతులు ఎదుర్కొన్న రిజ్వీ.. 70 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుకు ఒంటిచేత్తో విజయాన్ని అందించాడు. అతనికి తోడుగా ట్రిస్టన్ స్టబ్స్, 32 బంతుల్లో 39 పరుగులతో అజేయంగా క్రీజులో నిలిచి మ్యాచ్ ను ముగించాడు. నితీష్ రాణా, 15 పరుగులు చేశాడు. ఢిల్లీ జట్టు 17.1 ఓవర్లలో నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి 145 పరుగులు చేసి గెలుపు సంబరాలు చేసుకుంది.

**పోరాడిన ప్రిన్స్ యాదవ్,**

లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్, మూడు ఓవర్లలో 20 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. మొహ్సిన్ ఖాన్, మొహమ్మద్ షమీ, చెరో వికెట్ తీసుకున్నారు. తక్కువ స్కోరును రక్షించుకునే క్రమంలో లక్నో బౌలర్లు శాయశక్తులా ప్రయత్నించినా.. ఢిల్లీ బ్యాటర్ల ముందు వారి పప్పులు ఉడకలేదు. తుది ఫలితంగా లక్నోకు పరాజయం తప్పలేదు.



# స్లో ఓవర్ రేట్..

## కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు 12 లక్షల ఫైన్

**ఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ఎట్టకేలకు బోణి కొట్టింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో 3 వికెట్ల తేడాతో విజయం సాధించి పాయింట్ల పట్టికలో ఖాతా తెరిచింది. అయితే ఈ గెలుపు సంబరాల్లో ఉన్న పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు బీసీసీఐ గట్టి షాక్ ఇచ్చింది. మ్యాచ్ గెలిచిన ఆనందంలో ఉన్న అయ్యర్‌పై భారీ జరిమానా విధిస్తూ ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది.

**తప్పని 'స్లో ఓవర్ రేట్' దెబ్బ**

గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ నిర్ణీత సమయంలోగా ఓవర్లను పూర్తి చేయలేకపోయింది. స్లో ఓవర్ రేట్ నిబంధనను ఉల్లంఘించినందుకు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు రూ. 12 లక్షల జరిమానా విధించారు. ఈ సీజన్‌లో ఈ నిబంధన కింద జరిమానా ఎదుర్కొన్న తొలి కెప్టెన్‌గా అయ్యర్ నిలిచాడు. ఇది మొదటి తప్పు కావడంతో కేవలం ఫైన్‌తో సరిపెట్టారని, ఇదే పునరావృతమైతే కెప్టెన్‌పై నిషేధం పడే అవకాశం ఉంటుందని అధికారులు హెచ్చరించారు.

**కూపర్ కానలీ మెరుపులు**

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 162 పరుగులు చేసింది. అనంతరం 163 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్ 19.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌తో ఐపీఎల్ అరంగేట్రం చేసిన యువ ఆటగాడు కూపర్ కానలీ అద్భుత ఇన్నింగ్స్ ఆడి పంజాబ్‌ను గెలిపించాడు. కేవలం 44 బంతుల్లోనే 72 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. జట్టు గెలిచినప్పటికీ, బ్యాటింగ్‌లో కేవలం 18 పరుగులకే వెనుదిరగడం, చేతికి గాయం కావడం, దానికి తోడు భారీ జరిమానా పడటంతో అయ్యర్ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





# 3 కోట్ల ఫుట్‌ఫాల్స్ దాటేసిన ధురంధర్–2

రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డుల దిశగా దూసుకుపోతోంది. వసూళ్లలోనే కాకుండా, థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య (ఫుట్‌ఫాల్స్) విషయంలో కూడా ఈ సినిమా బాలీవుడ్‌లో సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం ఇండియాలో 3 కోట్ల ఫుట్‌ఫాల్స్‌ను దాటేసింది. కరోనా తర్వాత ఈ ఘనత సాధించిన ఆరో హిందీ చిత్రంగా 'ధురంధర్ 2' నిలిచింది. గతంలో 'గదర్ 2', 'జవాన్', స్త్రీ 2, ఛావా, 'ధురంధర్' మొదటి భాగం మాత్రమే ఈ మార్కును చేరుకున్నాయి. ప్రస్తుతం హిందీ వెర్షన్లలో అత్యధిక ఫుట్‌ఫాల్స్ సాధించిన చిత్రంగా 'పుష్ప 2' (దాదాపు 4 కోట్లు) కొనసాగుతోంది. అయితే, 'ధురంధర్: ది రివెంజ్' హవా చూస్తుంటే.. ఫుల్ రన్ ముగిసే సమయానికి అన్ని భాషల్లో కలిపి 5 కోట్ల ఫుట్‌ఫాల్స్‌ను సాధించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఈ రెండు భాగాలు కలిపి మొత్తం 8 కోట్లకు పైగా టికెట్లు అమ్ముడవడం అనేది భారతీయ సినిమా చరిత్రలో ఒక అసాధారణమైన విజయంగా రికార్డు సృష్టించనుంది. కలెక్షన్ల పరంగా 'ధురంధర్ 2' సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన 13వ రోజు కూడా ఈ చిత్రం అద్భుతమైన వసూళ్లను సాధించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా రూ.1400 కోట్ల మార్కును దాటిన తొలి బాలీవుడ్ చిత్రంగా చరిత్ర సృష్టించింది. భారతదేశంలో ఈ సినిమా ఇప్పటివరకు రూ.899 కోట్ల నెట్ వసూళ్లను సాధించగా, బుధవారం మార్నింగ్ షోలతో రూ.900 కోట్ల మైలురాయిని చేరుకుంది. రెండో వీకెండ్‌లో రూ.170 కోట్లు వసూలుచేయడంతో భారతీయ సినిమా చరిత్రలోనే అత్యధిక రెండో వారాంతపు వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది.




# 10న వస్తున్న లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ

తమిళ యువ హీరో ప్రదీప్ రంగనాథన్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. ఈ సినిమాలో టాలీవుడ్ బ్యూటీ కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే సెన్సార్ పనులు పూర్తి చేసుకుని సర్టిఫికెట్ అందుకున్న ఈ చిత్రం, అనేక వాయిదాల తర్వాత ఏప్రిల్ 10న తమిళంతో పాటు తెలుగులోనూ గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా తెలుగులో టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ విషయానికి వస్తే.. ఇది 2040వ సంవత్సరం నేపథ్యంలో సాగే ఒక ఆసక్తికరమైన ఫ్యూచరిస్టిక్ రొమాంటిక్ డ్రామాగా కనిపిస్తోంది. ప్రస్తుత కాలంలోని ఇన్‌స్టంట్ రిలేషన్ షిప్స్‌ను ఇష్టపడని హీరో(ప్రదీప్ రంగనాథన్) హీరోయిన్ (కృతి శెట్టి), పాతకాలం నాటి స్వచ్ఛమైన ప్రేమను కోరుకుంటారు. అయితే వీరి ప్రేమకథకు ఎస్. జే సూర్య ఎలా అడ్డుపడతాడు. ఎస్. జే సూర్య నడుపుతున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అనే సంస్థ ఉద్దేశ్యం ఏంటి అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇందులో ప్రేమ గురించే కాకుండా 2040లో ఏం మార్పులు రాబోతున్నాయి అనే చిన్న చిన్న విషయాలను కూడా చాలా చక్కగా చూపించారు మేకర్స్. యోగి బాబు, సీమన్, గౌరీ కిషన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నఈ చిత్రాన్ని లేడీ సూపర్ స్టార్ నయనతారతో కలిసి ఎస్.ఎస్. లలిత్ కుమార్ నిర్మించారు.

# బిజీ షెడ్యూల్ వల్లనే డ్రాగన్‌లో నటించలేకపోయా

## మళయాళ నటుడు టొవినో థామస్ వెల్లడి

టాలీవుడ్ హీరో ఎన్టీఆర్– కన్నడ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' సినిమా తెరకెక్కుతోంది. ఇందులో ఓ పాత్ర కోసం మలయాళ నటుడు టొవినో థామస్‌ని చిత్ర బృందం ఎంపిక చేయనున్నట్లు ఇటీవల వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. వీటిపై టొవినో స్పందించారు. తన కొత్త సినిమా 'పళ్లిచట్టంబి' ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో క్లారిటీ ఇచ్చారు. మలయాళంలో వేరే సినిమాలు చేస్తుండటంతో.. డేట్స్ సర్దుబాటు కాక 'డ్రాగన్'లో నటించట్లేదని తెలిపారు. ' తెలుగు సినిమాల్లో నటించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. మలయాళంలో వర్కింగ్ కల్చర్ టాలీవుడ్‌కు భిన్నంగా ఉంటుంది. తక్కువ సమయంలోనే షూటింగ్ పూర్తి చేస్తాం. తెలుగు చిత్రాల షూటింగ్ షెడ్యూల్స్ ఎక్కువ ఉంటాయి. పైగా ఒకేసారి రెండు/మూడు చిత్రాల్లో నటించడం నాకు ఇష్టం ఉండదు. ఒక సినిమా పూర్తయ్యాకే మరో సినిమా చేస్తుంటా. ఒకవేళ నేను టాలీవుడ్‌లో ఓ పెద్ద సినిమాలో నటిస్తే.. నేను అంగీకరించిన మూడు/నాలుగు మలయాళ చిత్రాలపై ప్రభావం పడుతుంది. అందుకే తెలుగు సినిమాల్లో నటించలేకపోతున్నా' అని వివరించారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహించిన 'పళ్లిచట్టంబి' ఏప్రిల్ 10న తెలుగులోనూ విడుదల కానుంది.






# సెట్స్‌లో నటి పట్ల అసభ్య ప్రవర్తన


## మళయాళ దర్శకుడు రంజిత్ అరెస్ట్

ప్రముఖ మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌ను లైంగిక వేధింపుల ఆరోపణలపై కొచ్చి పోలీసులు అరెస్ట్ చేశారు. ఒక యువ నటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎర్నాకుళం సెంట్రల్ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఒక సినిమా సెట్‌లో రంజిత్ తనతో అనుచితంగా ప్రవర్తించారని ఇటీవల ఓ నటి ఫిర్యాదు చేసింది. ఈ ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ప్రాథమిక విచారణ కోసం కొచ్చికి తరలించారు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించడానికి ముందు, చిత్ర యూనిట్‌లోని అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేశారు. కమిటీ సభ్యులు దానిని పరిశీలించి, అది తీవ్రమైన అంశంగా గుర్తించడంతో తదుపరి చర్యల కోసం కేసును కేరళ పోలీసులకు బదిలీ చేశారు. హేమ కమిటీ నివేదిక వెలువడిన తర్వాత మలయాళ సినీరంగంలో బయటపడుతున్న వరుస వేధింపుల కేసుల్లో ఇది మరొకటి కావడం గమనార్హం. గతంలోనూ రంజిత్‌పై ఇలాంటి ఆరోపణలు వచ్చాయి. 2024లో బెంగాలీ నటి చేసిన వేధింపుల ఆరోపణల వల్ల ఆయన తన కేరళ చలనచిత్ర అకాడమీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అప్పట్లో ఆ ఆరోపణలను రంజిత్ తోసిపుచ్చినప్పటికీ, తాజాగా మరో నటి ఫిర్యాదు చేయడంతో ఆయన చుట్టూ ఉచ్చు బిగిసినట్లయింది.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# పల్లెల్లో పేరు సర్పంచ్‌ది.. పాలన 'షాడో'దే

## ప్రజాస్వామ్యం కేవలం కాగితం మీదేనా?




- సంతకాలకే పరిమితమైన అసలు సర్పంచ్‌లు.. తెర వెనుక నుంచి చక్రం తిప్పుతున్న 'పెత్తందార్లు'
- మహిళా సర్పంచ్‌ల వెనుక భర్తల రాజ్యాంగం.. సూర్యాపేట జిల్లాలో వెల్లువెత్తుతున్న విమర్శలు

**నేటి సాక్షి, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలుగుతోంది. ప్రజలు ఓటేసి గెలిపించిన సర్పంచ్‌లు కేవలం నామమాత్రపు పదవులకే పరిమితం కాగా, క్షేత్రస్థాయిలో "షాడో సర్పంచ్"ల రాజ్యం నడుస్తోందన్న విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో భారీగా ఖర్చు చేసిన వ్యక్తులు లేదా అంగబలం ఉన్న నేతలే గ్రామ పాలనపై పూర్తి ఆధిపత్యం చలాయిస్తున్నారని సమాచారం. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ల ద్వారా పదవులు పొందిన మహిళా సర్పంచ్‌ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. భార్య పేరు మీద పదవి ఉన్నప్పటికీ, అధికారాలన్నీ వారి భర్తలే చెలాయిస్తున్నారు. ఇంటి పన్నుల వసూలు నుంచి పారిశుధ్య పనుల వరకు, నిధుల వినియోగం నుంచి బిల్లుల క్లియరెన్స్ వరకు అన్నీ ఈ 'షాడో'ల కనుసన్నల్లోనే జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అసలు సర్పంచ్‌లు కేవలం సంతకాలు చేసే యంత్రాలుగా మారిపోయారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. "షాడో చెప్పిందే వేదం.. లేదంటే పదవి ఖాళీ" అన్న చందంగా మారిన ఈ వ్యవస్థపై ఉన్నతాధికారులు స్పందించి, నిజమైన ప్రజాప్రతినిధులకు అధికారాలు దక్కేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందాలి

- ఇన్‌చార్జి ఎంపీడీఓ

**నేటి సాక్షి గజ్వేల్ :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ (వీణా) తెలిపారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు గజ్వేల్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ గ్రామసభల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు, లబ్ధిదారుల జాబితాలను గ్రామస్థుల సమక్షంలో ప్రకటించి పారదర్శకతతో అమలు చేస్తామని ఆయన తెలిపారు. ముఖ్యంగా రైతుల సంక్షేమానికి అమలవుతున్న రైతు భరోసా, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల బాలికల వివాహానికి అందించే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు అందించే ఆసరా పెన్షన్లు, మహిళలకు ఆర్థిక భరోసాగా అమలవుతున్న గృహలక్ష్మి పథకం, అలాగే పేదలకు సొంతింటి కల నెరవేర్చే ఇందిరమ్మ ఇండ్ల పథకం వంటి కార్యక్రమాల లబ్ధిదారుల వివరాలను గ్రామసభలో వివరించనున్నట్లు చెప్పారు. అర్హులైన వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో గ్రామసభలకు హాజరై తమ వివరాలను నమోదు చేసుకుని పథకాల ప్రయోజనాలు పొందాలని ఆయన సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, ప్రతి అర్హుడు తప్పకుండా లబ్ధి పొందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఎంపీడీఓ తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.








- మారిన కొనుగోలు కేంద్రం!
టోకెన్లు చేతిలో పెట్టి పంట కొనకుండా కాలయాపన.. వేలల్లో నష్టపోతున్న రైతులు
- "పంటలు పండించామా? లేక అధికారుల చుట్టూ తిరగడానికే బతికామా?" అంటూ రైతుల ఆవేదన,
- మార్కెట్ యార్డ్ వద్ద రైతుల ఆందోళన

# గజ్వేల్ మార్కెట్‌లో అధికారుల నిర్లక్ష్యం

# రైతుల పాలిట శాపం



**నేటి సాక్షి గజ్వేల్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో అధికారుల నిర్లక్ష్యం రైతుల సహనాన్ని పరీక్షిస్తోంది. ఆరుగాలం రాత్రి పగలు కష్టపడి అరకొర దిగుబడితో పంటలు పండించిన రైతులు, విక్రయానికి వచ్చేసరికి అధికారుల నిర్లక్ష్య వైఖరితో నానా అవస్థలు పడాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట కొనుగోలు చేయాలని కోరుతూ రైతులు మార్కెట్ గేటు ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. గత నెల 20వ తేదీన గజ్వేల్ మార్కెట్ ఆవరణలో ఫ్యాక్స్ ద్వారా పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు అధికారులు ప్రకటించారు. అయితే అది కేవలం పేరుకే పరిమితమైందని రైతులు ఆరోపిస్తున్నారు. అప్పటి నుంచి టోకెన్లు ఇచ్చిన అధికారులు ఇప్పటివరకు పంటలను కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. గత వారం రోజులుగా "కొనుగోలు ప్రారంభించండి" అంటూ రైతులు అధికారుల చుట్టూ తిరిగినా, వారి బాధను పట్టించుకునే వారు ఒక్కరూ లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల అధికారులు రైతులకు సమాచారం ఇచ్చి మార్కెట్ యార్డ్‌కు రావాలని సూచించడంతో చుట్టుపక్కల గ్రామాల రైతులు ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా పంటలను మార్కెట్‌కు తరలించారు. అయితే భారీగా పంట రావడంతో అధికారులు చేతులెత్తేసి, "మరో వారం తర్వాత కొనుగోలు చేస్తాం" అంటూ కరాకండిగా సమాధానం చెప్పారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటను మార్కెట్‌కు తీసుకురావడానికి ఒక్కో రైతు రూ.3000 నుంచి రూ.5000 వరకు వాహన అద్దె చెల్లించి నష్టపోతున్నామని రైతులు వాపోయారు. సాగు సమయంలో ఎరువుల ధరలు పెరగడం, కరెంట్ సమస్యలు, కూలీల కొరత వంటి ఇబ్బందులను తట్టుకుని పంట పండిస్తే, అమ్ముకునే వేళ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. రైతుల ఆవేదనకు మద్దతుగా సిపిఐ పార్టీ నేత సందేబోయిన ఎల్లయ్య సంఘటనా స్థలానికి చేరుకుని అధికారుల వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. రైతుల పంటలను తక్షణమే కొనుగోలు చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. రైతుల నిరసనతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అధికారులు రంగంలోకి దిగారు. రైతులను నచ్చజెప్పి మార్కెట్ యార్డ్‌లో పంట నిల్వ చేసుకునే అవకాశం కల్పించడంతో రైతులు తాత్కాలికంగా ఆందోళన విరమించారు. అయినప్పటికీ "ఇది తాత్కాలిక పరిష్కారం మాత్రమే.. కొనుగోలు వెంటనే ప్రారంభించాలి" అని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పంటలు కొనకుండా రైతులను రోజుల తరబడి తిరగబెడితే రైతుల నష్టాలు పెరిగిపోతాయని, ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని రైతులు స్పష్టం చేశారు. కొనుగోలు ప్రక్రియను మరింత ఆలస్యం చేస్తే పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమని రైతులు హెచ్చరించారు.

# జీతాలు లేక జీవితం అస్తవ్యస్తం

## గజ్వేల్ మున్సిపాలిటీలో కార్మికుల గర్జన



**నేటి సాక్షి గజ్వేల్ :** గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న సానిటేషన్ కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఆరు నెలలుగా జీతాలు చెల్లించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జీతాలు లేకపోవడంతో కుటుంబాలను పోషించలేక, పస్తులతో పనులు చేస్తూ అనారోగ్యాలకు గురవుతున్నామని వాపోయారు. ఈ నేపథ్యంలో శానిటేషన్ సిబ్బంది విధులను బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. తమ సమస్యను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. చేసిన పనికి జీతం రాకుంటే తాము ఎలా బతకాలని, పిల్లలను ఎలా చదివించాలని అధికారులను ప్రశ్నించారు. కాగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న కొంతమందికి మాత్రమే జీతాలు చెల్లిస్తూ తమను పక్కన పెట్టారని ఆందోళనకారులు ఆరోపించారు. ప్రభుత్వం అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించినప్పటికీ స్థానిక అధికారుల నిర్లక్ష్యం కారణంగా సమయానికి జీతాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము గత 20 ఏళ్లుగా మున్సిపాలిటీలో పనిచేస్తున్నా ఇప్పటివరకు ఎప్పుడూ సమయానికి జీతాలు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన జీతాలను వారం రోజుల్లో చెల్లించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట అనిర్దిష్ట సమ్మె చేపడతామని కార్మికులు హెచ్చరించారు. ఈ ఆందోళనకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందేబోయిన ఎల్లయ్య మద్దతు ప్రకటించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి సమయానికి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు అందించాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో సానిటేషన్ సిబ్బందితో పాటు అన్ని విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందిని కలుపుకొని మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# అంజన్న సన్నిధిలో ప్రమాదం

## కూలిన చలువ పందిళ్లు..15 మంది భక్తులకు గాయాలు



**నేటి సాక్షి,జగిత్యాల(రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద బుధవారం భారీ ప్రమాదం తృటిలో తప్పింది. హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తాత్కాలిక చలువ పందిళ్లు ఒక్కసారిగా కూలిపోవడంతో తీవ్ర కలకలం రేగింది. ఈ ఘటనలో సుమారు 15 మంది భక్తులకు గాయాలు కాగా, వారిని వెంటనే చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రులకు తరలించారు. పందిళ్లు కూలిన సమయంలోనే పక్కనే ఉన్న విద్యుత్ తీగలు కూడా తెగిపడటంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. సకాలంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వేలాదిగా భక్తులు తరలివచ్చే జయంతి ఉత్సవాల వేళ, అధికారులు చేసిన ఏర్పాట్ల నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిర్మాణ లోపమా లేదా గాలివాన ప్రభావమా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షించి, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. భక్తులు ఆందోళన చెందవద్దని, దర్శనాలు సజావుగా సాగేలా అదనపు భద్రతా చర్యలు తీసుకున్నామని ఆలయ వర్గాలు వెల్లడించాయి.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**నల్లబెల్లి, నేటిసాక్షి:** మండలంలోని కొండాపురం గ్రామంలో నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి సహకారంతో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిట్యాల తిరుపతి రెడ్డి బుధవారం ప్రారంభించినారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ గ్రామ సర్పంచ్ అబ్బరబోయిన లలిత సురేష్, నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్తారి శేఖర్, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ చరణ్ సింగ్, మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు కుసుంబ రఘుపతి, మండల కార్యదర్శి జిల్లా మునీందర్, మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నల్లగొండ సుధాకర్, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ సొసైటీ డైరెక్టర్ చిట్యాల ఉపేందర్ రెడ్డి, గుండ్లఫాడ్ గ్రామ సర్పంచ్ అనిత శ్రీనివాస్, కొండలపల్లె గ్రామ సర్పంచ్ నరేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు కొండ నారాయణ,నల్లబెల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు బత్తినీ మహేష్, గ్రామ కార్యదర్శి పృథ్వీ రాజు, ఉపసర్పంచ్ వెంకన్న, కాంగ్రెస్ నాయకులు దేగల కృష్ణ, వేముల సంపత్ రెడ్డి, బోట్ల మొగిలి, రమణ, సదయ్య,రాజు, కల్తీ సాంబయ్య, కొమ్రారెడ్డి, శ్రావణ్, లలిత,ఈసం విజయ, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు వేసవి ఊరట

**ఏప్రిల్‌లో హాఫ్ డే, మే నెలంతా సెలవులు**



**నేటి సాక్షి, జగిత్యాల (రాధారపు నర్సయ్య):** రాష్ట్రంలోని అంగన్వాడీ సిబ్బందికి ప్రభుత్వం వేసవి వెసులుబాటు కల్పించింది. అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) ప్రతినిధులు హైదరాబాద్‌లో జాయింట్ డైరెక్టర్ అక్కేశ్వరరావును కలిసి వినతిపత్రం సమర్పించిన నేపథ్యంలో, ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వీటి ప్రకారం ఏప్రిల్ 1 నుండి 30 వరకు అంగన్వాడీ కేంద్రాలు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు మాత్రమే (హాఫ్ డే) పనిచేస్తాయి. మే 1 నుండి 31 వరకు విద్యార్థులు, టీచర్లు మరియు హెల్పర్లకు పూర్తిస్థాయి వేసవి సెలవులు ప్రకటించారు. అయితే సెలవుల కాలంలో టేక్ హోమ్ రేషన్ పంపిణీ, సర్వేల వంటి విధులను సిబ్బంది నిర్వహించాల్సి ఉంటుంది. రిటైర్ అయిన సిబ్బందికి అందాల్సిన బెనిఫిట్స్, పోషణ అభియాన్ బకాయిలను ఈ నెలలోనే చెల్లిస్తామని జేడీ హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 15 వేల ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతించిందని, అయితే కొత్త నియామకాల కంటే ముందుగా అర్హులైన హెల్పర్లకు టీచర్లుగా పదోన్నతులు కల్పిస్తామని స్పష్టం చేశారు. సిబ్బందికి అవసరమైన కొత్త మొబైల్ ఫోన్లు సిద్ధంగా ఉన్నాయని, త్వరలోనే ముఖ్యమంత్రి లేదా మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేస్తామని వెల్లడించారు. వేతనాల చెల్లింపు ప్రక్రియ కూడా రెండు మూడు రోజుల్లో పూర్తి అవుతుందని భరోసా ఇచ్చారు. ఈ భేటీలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయీశ్వరి, ప్రధాన కార్యదర్శి నందూరి కరుణకుమారి, సీతామహాలక్ష్మి, దయావతి తదితరులు పాల్గొన్నారు.

# మెరిసిన కొండాపూర్ క్రీడాకారులు

**నెట్‌బాల్ పోటీల్లో నారాయణపేట విద్యార్థుల రజత గర్జన**




**నేటి సాక్షి, (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కొండాపూర్ గిరిజన గురుకుల విద్యార్థులు జాతీయస్థాయిలో సత్తా చాటారు. ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన 4వ జూనియర్ నేషనల్ మిక్స్‌డ్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టు తరపున ఆడిన కిషన్, మోహన్, హర్ష వర్ధన్ అద్భుత ప్రతిభ కనబరిచి రజత పతకం (సిల్వర్ మెడల్) సాధించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి గుర్తింపు తెచ్చినందుకు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డా. ఎస్. రమేష్, కార్యదర్శి డా. ఎం. రామ్ మోహన్ గౌడ్, పీఈటీ ఆంజనేయులు మరియు అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను ఘనంగా అభినందించారు.

# సిసి రోడ్డు పనులు ప్రారంభం



**నేటి సాక్షి నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని పసుపుల గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ నర్మదా రవికుమార్ గౌడ్ ఆధ్వర్యం లో గ్రామంలోని శ్రీశ్రీశ్రీ కోట్ల మైసమ్మ మరియు లక్ష్మమ్మ గుడి దగ్గర సిసి రోడ్ నిర్మాణం చేపట్టడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేష్, గ్రామ వార్డు సభ్యులు గ్రామ పెద్దలు మహిళలు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో కార్ల డీలింగ్‌లో మోసం

**రూ.4.65 లక్షలు ఎగవేత**

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలో కార్ల కొనుగోలు వ్యవహారంలో జరిగిన ఒక మోసం ఘటన వెలుగులోకి వచ్చింది. తనను తాను రిపోర్టర్‌గా పరిచయం చేసుకుని కారు కన్సల్టెన్సీ యజమానులను నమ్మించిన ఓ వ్యక్తి, రెండు కార్లు తీసుకుని రూ. 4.65 లక్షల మేర ఎగవేతకు పాల్పడ్డాడు. బాకీ డబ్బులు అడిగితే బెదిరింపులకు దిగుతున్నట్లు బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వెల్గటూర్ మండలం ముత్తునూరు గ్రామానికి చెందిన మూటపలుకుల వెంకట్ అనే వ్యక్తి కోరుట్లలోని జై భజరంగ్ కారు కన్సల్టెన్సీ వద్ద హ్యుందాయ్ క్రేటా మరియు గ్రాండ్ ఐ-10 కార్లను తీసుకున్నాడు. ఈ రెండు వాహనాలకు సంబంధించి మొత్తం రూ. 4.65 లక్షలు చెల్లించాల్సి ఉండగా, తప్పించుకుంటూ తిరుగుతున్నాడు. కన్సల్టెన్సీ యజమానులు చెక్కపల్లి నవీన్, కుర్ర ఆంజనేయులు బాకీ డబ్బులు అడగగా, నిందితుడు వారిని బెదిరింపులకు గురిచేశాడు. బాధితుడు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోరుట్ల పోలీసులు చీటింగ్ మరియు బెదిరింపుల కింద కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టామని, దర్యాప్తు కొనసాగుతోందని ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

# కొండగట్టు హనుమాన్ చిన్న జయంతి



- భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసుల అప్రమత్తం
- బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు
- అనుమానాస్పదులపై ప్రత్యేక నిఘా - ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి

**నేటి సాక్షి, జగిత్యాల(రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఆదేశాల మేరకు ఆలయ పరిసరాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా కొండగట్టు ఆలయానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఆలయ ప్రాంగణం మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచడంతో పాటు, ప్రతి ప్రవేశ ద్వారం వద్ద పోలీసులను మోహరించారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక క్యూలైన్లు, బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాలు, పార్కింగ్ స్థలాలు, ప్రధాన ప్రవేశ ద్వారాలు, మరియు భక్తులు అధికంగా సంచరించే ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాల ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వస్తువులు, బ్యాగులు, వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నారు. పోలీసులు ఆలయం పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టారు. సాదారణ దుస్తుల్లో పోలీసులు గుమిగూడే ప్రదేశాల్లో పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఏవైనా అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే స్పందించేందుకు క్విక్ రెస్పాన్స్ టీంలను సిద్ధంగా ఉంచారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామి వారి దర్శనం చేసుకునేలా అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని, ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే సమీప పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. భక్తులు క్రమశిక్షణతో వ్యవహరించి భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు.

# కోరుట్లలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

- రేపు భారీ అన్నప్రసాద వితరణ
- బాలాజీ రోడ్ రాంనగర్ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు
- భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి: మాజీ కౌన్సిలర్ మాడవేణి నరేష్ పిలుపు

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలోని బాలాజీ రోడ్ రాంనగర్ ప్రాంతంలో గల శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం (ఏప్రిల్ 2) హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకుని భారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు 22వ వార్డు మాజీ కౌన్సిలర్ మాడవేణి నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వినియోగం ఉంటుందని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నరేష్ పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్వచ్ఛంద సేవకులను కూడా నియమించినట్లు వెల్లడించారు. స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, అన్నప్రసాదాన్ని స్వీకరించి స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆయన కోరారు.




# తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు




- కొడుకుల్లో భయం, భక్తి కోసమే కొత్త చట్టం!
- ఫిర్యాదు చేసిన 60 రోజుల్లోనే పరిష్కారం.. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకూ వర్తింపు
- అస్సాం కంటే పదునైన చట్టం తెలంగాణలో: వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**నేటి సాక్షి, జగిత్యాల, (రాధారపు నర్సయ్య):** కన్నవారిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యతను విస్మరిస్తున్న సంతానానికి బుద్ధి చెప్పేందుకే రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల సంరక్షణ-పర్యవేక్షణ చట్టం 2026'ను తీసుకువచ్చిందని రాష్ట్ర వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బుధవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ చట్టం దేశంలోనే అత్యంత కఠినమైనదని, ఇది కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా ప్రైవేటు ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు కూడా వర్తిస్తుందని స్పష్టం చేశారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారిపై జిల్లా కలెక్టర్లకు ఫిర్యాదు చేయవచ్చని, అందిన ఫిర్యాదును 60 రోజుల్లోపు విచారించి బాధితులకు న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానవీయ కోణంలో ఆలోచించి ఈ చట్టాన్ని రూపొందించారని, దీని అమలులో పోలీసుల సహకారం కూడా తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్ర వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ మాట్లాడుతూ.. అస్సాం రాష్ట్రం కంటే మెరుగైన నిబంధనలతో ఈ చట్టాన్ని పకడ్బందీగా రూపొందించామని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం వయోవృద్ధుల సంఖ్య సుమారు 48 లక్షలకు చేరుకుందని అంచనా వేస్తున్నామని, వారి రక్షణ కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అటెండర్ అయినా అక్షరాలు నేర్పిన గురువు





**నేటి సాక్షి, కథలాపూర్ (రాధారపు నర్సయ్య):** ఉద్యోగం ఏదైనా చేసే పనిలో నిబద్ధత ఉంటే ఆ వ్యక్తి అందరి గుండెల్లో నిలుస్తాడని కథలాపూర్ మండలం తక్కళ్ళపల్లి ప్రభుత్వ పాఠశాల అటెండర్ ఎక్కల్ దేవి భాస్కర్ నిరూపించారు. 1986లో కేవలం రూ. 150 వేతనంతో పార్ట్‌టైమ్ స్వీపర్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమం అత్యంత భావోద్వేగ భరితంగా సాగింది. నాలుగు దశాబ్దాల పాటు పాఠశాల వికాసానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ గ్రామస్థులు, ఉపాధ్యాయులు కన్నీటి పర్యంతమయ్యారు. కోరుట్ల నుంచి తక్కళ్ళపల్లి వరకు ప్రతిరోజూ 15 కిలోమీటర్ల దూరం సైకిల్‌పై ప్రయాణిస్తూ, ఎండనక వాననక విధులకు హాజరైన భాస్కర్ క్రమశిక్షణ అందరికీ ఆదర్శమని వక్తలు కొనియాడారు. అటెండర్‌గా ఉంటూనే విద్యార్థులకు ఓనమాలు నేర్పడంలోనూ ఆయన ముందుండేవారు. కేవలం రూ. 4 వేల అల్ప వేతనంతో ఉద్యోగ విరమణ చేసినప్పటికీ, ఆయన సంపాదించుకున్న అతిపెద్ద ఆస్తి గ్రామస్థుల ప్రేమాభిమానాలేనని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజగంగారం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు మరియు భాస్కర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఊరంతా తరలివచ్చి భాస్కర్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించి, ఆయన విశ్రాంత జీవనం సుఖసంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు.

- రూ. 150 జీతంతో మొదలై.. రూ. 4 వేలతో ముగిసిన నాలుగు దశాబ్దాల సేవా ప్రయాణం
- తక్కళ్ళపల్లి అటెండర్ భాస్కర్‌కు కంటతడితో వీడ్కోలు పలికిన గ్రామస్థులు
- రోజూ 15 కి.మీ. సైకిల్‌పై ప్రయాణం.. విధి నిర్వహణలో అంకితభావానికి నిలువెత్తు రూపం

# క్యాతనపల్లి మున్సిపల్ పరోక్ష ఎన్నికలకు సర్వం సిద్ధం



- అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య
- ఏప్రిల్ 4న చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక.. పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశం
- మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాట్ల పరిశీలన.. పటిష్ట బందోబస్తుకు ఏసీపీకి సూచనలు

**నేటి సాక్షి,మంచిర్యాల:** క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మరియు వైస్ చైర్‌పర్సన్ పదవులకు ఈ నెల 4న నిర్వహించనున్న పరోక్ష ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మున్సిపల్ కార్యాలయం, ఎన్నికల వేదికలను ఏసీపీ, తహసీల్దార్ మరియు కమిషనర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నోటీసులను కౌన్సిలర్లకు నిర్ణీత సమయంలో అందజేయాలని, సమావేశ మందిరంలో కూర్చునే ఏర్పాట్లు, మైక్ వ్యవస్థ, రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయ పరిసరాల్లో బారికేడింగ్ ఏర్పాటు చేసి, అనవసర గుంపులు రాకుండా చూడాలని అసిస్టెంట్ ఇంజనీర్‌కు సూచించారు. తాగునీరు, విద్యుత్, శానిటేషన్ వంటి మౌలిక సదుపాయాల్లో లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా స్థానిక ఏసీపీ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, సీఐలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చౌడేపల్లిలో సర్పంచులకు ఘన సన్మానం





- వైఎస్ఆర్సీపీ కార్యాలయంలో ఉత్సాహభరిత వేడుక.. సర్పంచుల సేవలకు గుర్తింపు
- పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మార్గదర్శకత్వంలో అభివృద్ధి పథం.. నిబద్ధతతో పనిచేస్తామని వెల్లడి

**నేటి సాక్షి,చౌడేపల్లి:** చౌడేపల్లి మండలంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గత ఐదేళ్లుగా సర్పంచులుగా ఎన్నికై గ్రామ వికాసానికి కృషి చేసిన ప్రజాప్రతినిధులకు బుధవారం ఘన సన్మానం నిర్వహించారు. సర్పంచుల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో మండల పార్టీ అధ్యక్షులు జి. నాగభూషణ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా ప్రతి సర్పంచును శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. సన్మానం పొందిన సర్పంచులు మాట్లాడుతూ.. పదవీకాలం ముగిసినప్పటికీ ప్రజల పక్షాన నిలబడి సేవ చేయడంలో తమ నిబద్ధత యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచనలు, సలహాలు తమకు నిరంతరం మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఆయన అండదండలతో నియోజకవర్గవ్యాప్తంగా, మండల స్థాయిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు సాధ్యమయ్యాయని, పదవి కంటే ప్రజాసేవే ముఖ్యమని వారు అభిప్రాయపడ్డారు. పార్టీ అండదండలతో భవిష్యత్తులోనూ ప్రజల కోసం పనిచేస్తామని భరోసా



ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సర్పంచులకు అభినందనలు తెలిపారు.

# విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సర్కార్ ప్రాధాన్యత



- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- కేజీబీవీలో సౌకర్యాల పరిశీలన.. విధుల్లో నిర్లక్ష్యం వహించిన 11 మందికి షోకాజ్ నోటీసులు
- ప్రజాపాలన ప్రగతిలో భాగంగా వైద్య శిబిరాల నిర్వహణ.. బెల్లంపల్లిలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

**నేటి సాక్షి,మంచిర్యాల:** ప్రభుత్వం విద్య, వైద్య రంగాల బలోపేతంతో పాటు మహిళల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం ఆయన బెల్లంపల్లి మండల కేంద్రంలో పర్యటించి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), తహశీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు బట్వాన్‌పల్లిలోని వైద్య శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేజీబీవీలో తరగతి గదులు, పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి నాణ్యమైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లను తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని, ప్రజల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. విధులకు గైర్హాజరైన, సమయపాలన పాటించని 11 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన, మందుల నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని, ఆసుపత్రిలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. బట్వాన్‌పల్లిలో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి, ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు అందజేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన 15 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో తహశీల్దార్, వైద్యాధికారులు మరియు ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# నేడు మరికల్ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ

- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికపై ప్రజలకు అవగాహన.. పాల్గొనాలని కోరిన కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి
- గురువారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం.. ప్రభుత్వ పథకాలపై చర్చలు

**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** మరికల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడిన ఆయన, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఈ సభను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గురువారం ఉదయం 10:00 గంటలకు ప్రారంభమయ్యే ఈ గ్రామసభలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించనున్నారు. అదేవిధంగా గ్రామ అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజల సూచనలు, అభిప్రాయాలను సేకరించి చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కావున గ్రామ ప్రజలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ గ్రామసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.



# విద్యార్థులకు సైకిల్ పంపిణీ

బాలాజీ గోల్డ్ అండ్ సిల్వర్



**నేటి సాక్షి నారాయణపేట,(ఇమామ్ సాబ్ ):** నారాయణపేట జిల్లాలోని జాజాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం బాలాజీ గోల్డ్ మరియు సిల్వర్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు లైన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట వారి సౌజన్యంతో దూర ప్రాంతాల నుండి పాఠశాల వచ్చే బీద విద్యార్థులకు సైకిల్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాలాజీ గోల్డ్ మరియు సిల్వర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండిసాకేత్ బట్టడ్ మరియు ఫాస్ట్ గవర్నర్ లైన్ హరి నారాయణ బట్టడ్ మాట్లాడుతూ విద్యార్థులు చాలా చక్కగా చదువుకొని విద్యార్థులు ఉన్నత స్థానంలో చేరుకోవాలని గ్రామానికి పాఠశాలకు మరియు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బీదవారికి అన్ని విధాలుగా సహాయం చేస్తామని తెలియజేశారు ఈ పంపిణీలో వివిధ పాఠశాలల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ కు 10సైకిళ్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామరగిద్దకు 10 సైకిళ్లు ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాలక నారాయణపేటకు 10 సైకిళ్లు ప్రభుత్వ బాలికలు ఉన్నత పాఠశాల నారాయణపేటకు 10 సైకిలు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లైన్ సరిత బట్టడ్ సెక్రెటరీ సాయినాథ్ మరియు లైన్ సభ్యులు జనార్దన్ రెడ్డి సాయినాథ్ సురేందర్ కృష్ణమూర్తి బాలాజీ రవి తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామరగిద్ద ప్రధానోపాధ్యాయులు సురేష్ మరియు తిప్పన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ ఉపాధ్యాయులు భాను ప్రకాష్ లక్ష్మణ్ మరియు విద్యార్థి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎల్లమ్మను దర్శించుకున్న ప్రముఖులు



**నేటి సాక్షి, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలో కొనసాగుతున్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి సిద్ధోగం జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రముఖులు ఆలయాన్ని సందర్శించారు. గ్రానైట్ అధినేత రాచకొండ తిరుపతి గౌడ్ మరియు బిఆర్ఎస్ జిల్లా నాయకులు తన్నీరు శరత్ రావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో భాగంగా నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల గౌడ సంఘం కమిటీ ఆధ్వర్యంలో రాచకొండ తిరుపతి గౌడ్ మరియు తన్నీరు శరత్ రావులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా నాయకులు నాగుల కనుకయ్య గౌడ్, మండల గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర తిరుపతి గౌడ్, నేతలు బుర్ర మల్లేశం గౌడ్, భూమేష్ గౌడ్, నాగరాజు మరియు గౌడ సంఘం ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

కాంగ్రెస్ నాయకులు పంది రాజు



**నేటి సాక్షి,తొగుట (వడ్డే నరసింహులు):** సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని వెంకటరావుపేట గ్రామానికి చెందిన మహమ్మద్ తాజోద్దీన్ ఇటీవల అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి సహకారంతో బాధితుడికి రూ. 32,500 ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఖీ) మంజూరైంది. బుధవారం ఈ చెక్కును కాంగ్రెస్ సీనియర్ నాయకులు పంది రాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు బండారు రమేష్ గౌడ్‌తో కలిసి లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా పంది రాజు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, సీఎం రిలీఫ్ ఫండ్ ఆపదలో ఉన్న నిరుపేదలకు వరంగా మారిందని కొనియాడారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన ప్రతి ఒక్కరూ తమ బిల్లులను సమర్పిస్తే, ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందుతుందని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న చెరుకు శ్రీనివాస్ రెడ్డికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు అనిల్, వార్డు సభ్యుడు భానుచందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వామి, చరణ్ గౌడ్, కిసాన్ సెల్ అధ్యక్షుడు మిద్దె స్వామి, సత్యనారాయణ, వడ్డే నర్సింలు, రవి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ డిక్లరేషన్ పేరుతో అన్యాయం

**కత్తుల కాన్షీరామ్**



**నేటి సాక్షి, నల్లగొండ:** ఎస్సీ వర్గాలకు చెందిన విద్యార్థులపై జరుగుతున్న అన్యాయాలకు ప్రభుత్వం వెంటనే ముగింపు పలకాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి కత్తుల కాన్షీరామ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నల్లగొండలో మాట్లాడుతూ, ఇప్పటికే కుల ధృవీకరణ పత్రాలు ఉన్న ఎస్సీ విద్యార్థులను 'ఎస్సీ డిక్లరేషన్' పేరుతో మళ్లీ మళ్లీ ఇబ్బందులకు గురి చేయడం పూర్తిగా అన్యాయమని మండిపడ్డారు. పేద విద్యార్థులు చదువు కోసం ప్రభుత్వ పథకాలపై ఆధారపడుతున్న సమయంలో, అదనపు డిక్లరేషన్‌లు అడిగి వారిని అవమానించే విధానాన్ని ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది ఎస్సీ వర్గాల హక్కులను కాలరాసే చర్య అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం ముందు పలు డిమాండ్లు ఉంచారు. ఎస్సీ డిక్లరేషన్ పేరుతో జరుగుతున్న వేధింపులను వెంటనే ఆపాలని, ఇప్పటికే కుల ధృవీకరణ ఉన్న విద్యార్థులకు మళ్లీ డిక్లరేషన్ అడగకూడదని స్పష్టం చేశారు. అలాగే ఎస్సీ విద్యార్థులకు అందాల్సిన స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. అణగారిన వర్గాల హక్కులను ప్రభుత్వం కాపాడాలని, ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఎస్సీ వర్గాల హక్కుల కోసం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కత్తుల కాన్షీరామ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.

# 24 గంటల నిరవధిక దీక్ష



**నేటి సాక్షి,మంచిర్యాల (శ్రీధర్ దమ్ము):** మంచిర్యాల పట్టణంలోని బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈనెల 7వ తేదీన తలపెట్టిన 24 గంటల నిరవధిక దీక్ష గోడప్రతులను బుధవారం జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ, గత 40 సంవత్సరాలుగా దేశంలో మరియు రాష్ట్రంలో బీసీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు సాగుతున్నాయని గుర్తు చేశారు. దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ గానీ, ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ గానీ బీసీల సమస్యలను పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమయ్యాయని వారు మండిపడ్డారు. బీసీల హక్కుల సాధన కోసం చేపట్టిన ఈ పోరాటంలో భాగంగా, మంచిర్యాల జిల్లాలోని అన్ని బీసీ కుల సంఘాలు, బీసీ వాదులు మరియు మేధావులు ఏకమై ఈ దీక్షకు సంఘీభావం తెలపాలని వారు పిలుపునిచ్చారు. 7వ తేదీన నిర్వహించనున్న ఈ 24 గంటల నిరవధిక దీక్షను విజయవంతం చేయడం ద్వారా ప్రభుత్వాలకు బీసీల సత్తా చాటాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి బీసీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గజెల్లి వెంకటయ్య, తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ, వేముల అశోక్, మంచెర్ల సదానందం, చెలిమెల అంజయ్య, రామగిరి రాజన్న చారి తదితరులు పాల్గొన్నారు.

# సహాయనిధి పేదలకు ఒక వరం

**ఎమ్మెల్యే గిత్త జయసూర్య**



**నేటి సాక్షి,పాములపాడు:** నందికొట్కూరు నియోజకవర్గం పాములపాడు మండలం పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే గిత్త జయసూర్య బుధవారం పంపిణీ చేశారు. పాములపాడు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై, కూటమి నాయకులతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా అండగా నిలుస్తోందని కొనియాడారు. ఈ పథకం పేదలకు ఒక వరమని, దీనిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం ఆరుగురు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఇందులో ఎర్ర గూడూరు గ్రామానికి చెందిన రిషికేశ్‌కు అత్యధికంగా రూ. 7,07,389 మంజూరయ్యాయి. మద్దూరుకు చెందిన సుదర్శన్ రావుకు రూ. 1,22,220, ఇస్కాల గ్రామానికి చెందిన ఎర్వ శ్రీనివాస్ రెడ్డికి రూ. 23,200, అల్వ సరస్వతికి రూ. 50,000, మంగిలి విజయకుమార్ మరియు మహాలక్ష్మిలకు తలా రూ. 35,000 చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, హరినాథ్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ రాయపాటి గోవిందు, ఎర్వ నాగలక్ష్మి రెడ్డి, మద్దూరు తిమ్మారెడ్డి, కురవ లింగస్వామి, చిన్న వెంకటరెడ్డి, రమణారెడ్డి, సోషల్ మీడియా ప్రతినిధి నాగరాజు మరియు కూటమి మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫిజిక్స్ సమ్మర్ స్కూల్‌కు ఎన్‌జీ విద్యార్థినులు ఎంపిక




**నేటి సాక్షి, నల్లగొండ:** నల్లగొండ పట్టణంలోని ఎన్ జీ (నీలం సంజీవరెడ్డి) ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాల విద్యార్థినులు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. బెంగళూరులోని ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ థియరిటికల్ సైన్సెస్ (ICTS. TIFR) నిర్వహించనున్న "సమ్మర్ స్కూల్ ఫర్ ఉమెన్ ఇన్ ఫిజిక్స్ 2026" ప్రోగ్రామ్‌కు ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థినులు వుయ్యాల వీణ గౌడ్, మరియు ఎదుళ్ల పూజ రెడ్డి ఎంపికయ్యారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ మరియు అధ్యాపక బృందం విద్యార్థినులను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జూన్ నెలలో జరిగే ఈ ప్రతిష్టాత్మక శిక్షణకు దేశవ్యాప్తంగా కేవలం 60 మంది విద్యార్థినులు మాత్రమే ఎంపికయ్యారని, అందులో తెలుగు రాష్ట్రాల (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) నుండి ఎంపికైన ఏకైక విద్యార్థినులు వీరే కావడం గర్వకారణమని పేర్కొన్నారు. టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ పరిధిలోని ఐసీటీఎస్లో అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తల పర్యవేక్షణలో వీరు భౌతికశాస్త్రంలోని ఆధునిక మెళకువలను అభ్యసిస్తారని తెలిపారు. వీరి పట్టుదల, సైన్స్ పట్ల ఉన్న ఆసక్తి ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పరంగి రవికుమార్, ఫిజిక్స్ హెచ్‌ఓడి డాక్టర్ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు మునగాల వెంకట్ రెడ్డి, డాక్టర్ వి. వెంకటేశం, మన్యం వెంకటయ్య, అకడమిక్ కో-ఆర్డినేటర్ బత్తిని నాగరాజు మరియు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి ఎద్దడి రాకూడదు

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి: మంత్రి సీతక్క
- జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి - అధికారులకు దిశానిర్దేశం
- రూ. 200 కోట్లతో గోదావరి జలాల మళ్లింపు.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆర్థిక చేయూత



**నేటి సాక్షి,ములుగు:** వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, యుద్ధప్రాతిపదికన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అధికారులను ఆదేశించారు. బుధవారం ములుగు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలిసి తాగు, సాగునీరు మరియు ఇందిరమ్మ ఇళ్లపై జిల్లా ఉన్నతాధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గుత్తికోయ ప్రాంతాల్లో తాగునీటి సమస్య రాకుండా చేతి పంపులు, ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, ప్రతి గ్రామపంచాయతీలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వేగం పెంచేందుకు లబ్ధిదారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని, నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులు మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉంటే తక్షణమే లక్ష రూపాయల రుణం అందేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మొదటిసారిగా రూ. 200 కోట్ల నిధులతో గోదావరి జలాలను జిల్లాకు మళ్లిస్తోందని మంత్రి వెల్లడించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిధులను నిబంధనల ప్రకారమే ఖర్చు చేస్తూ ప్రజాధనం వృథా కాకుండా చూడాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్డీవో వెంకటేష్ మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


# గురుకుల ప్రిన్సిపాల్‌ను డిస్మిస్ చేయాలి



**నేటి సాక్షి,మిర్యాలగూడ:** దామరచర్ల బీసీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారిని వేధింపులకు గురిచేస్తున్న ప్రిన్సిపాల్‌ను వెంటనే విధుల్లోంచి తొలగించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం మిర్యాలగూడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల బీసీ గురుకులంలో విద్యార్థినులు భోజనం అడిగినందుకు వారిని విచక్షణారహితంగా దూషించడమే కాకుండా, మోకాళ్లపై కూర్చోబెట్టి శిక్షించడం ప్రిన్సిపాల్ రాక్షస ప్రవృత్తికి నిదర్శనమని మండిపడ్డారు. పేద విద్యార్థులను చులకనగా చూస్తూ వేధిస్తున్న ఇలాంటి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో సదరు ప్రిన్సిపాల్‌పై అనేక ఆరోపణలు వచ్చినప్పటికీ, ఉన్నతాధికారులకు మరియు సెక్రటరీకి విన్నవించినా నేటికీ స్పందించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులు నిత్యం ఏదో ఒక సమస్యతో బాధపడుతున్నా అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే ప్రిన్సిపాల్‌పై సమగ్ర విచారణ జరిపి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జక్క నాగేశ్వరరావు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు కొర్ర పెడతా సురేష్, పట్టేటి రమేష్, ఎర్రబెల్లి గంగాధర్, ఉపేందర్, రామరాజు, నరేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థుల సౌకర్యార్థం మౌలిక వసతులు

- అంతర్జాతీయ ప్రమాణాలతో రూ. 200 కోట్లతో సమీకృత గురుకులాలు - త్వరలోనే పనులు ప్రారంభం
- ఉద్యోగులకు ఏడో తేదీలోపు జీతాల చెల్లింపు.. గత ప్రభుత్వ బకాయిలకు చెక్ పెట్టిన రేవంత్ సర్కార్
- ధర్మారంలో ఐటీఐ, డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు - కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి పర్యటన



**నేటి సాక్షి, ధర్మారం:** రాష్ట్రంలోని గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన ధర్మారం మండలంలోని గిరిజన మినీ గురుకులంలో నిర్మించనున్న అదనపు తరగతి గదుల పనులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం ఐదవ తరగతి వరకు ఉన్న ఈ మినీ గురుకులాన్ని పదవ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులందరూ ఒకేచోట అంతర్జాతీయ ప్రమాణాలతో చదువుకునేలా రూ. 200 కోట్లతో సమీకృత గురుకులాలను నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గురుకుల సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు నెలల తరబడి పెండింగ్‌లో ఉండేవని, ఇప్పుడు డిప్యూటీ సీఎం సహకారంతో ప్రతి నెలా 7వ తేదీలోపు చెల్లింపులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. వేసవి సెలవుల్లో గురుకులాల్లో అవసరమైన మరమ్మతు పనులను పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరం నాటికి సిద్ధం చేయాలని సూచించారు. మండలంలో త్వరలోనే ఐటీఐ భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని, అలాగే డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం పట్టణంలోని వివిధ ప్రభుత్వ స్థలాలను కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. పీఎం జుగా నిధులతో అభివృద్ధి: కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, 'ప్రధాన మంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్' (పీఎం జుగా) కింద రూ. 1.10 కోట్లతో హాస్టల్ భవనం, అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. మిగిలిన జిల్లాల కంటే పెద్దపల్లిలోనే పనులు వేగంగా ప్రారంభమవుతున్నాయని, ఇంజనీరింగ్ అధికారులు నాణ్యతతో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఆట వస్తువులు, సైకిళ్లు పంపిణీ చేస్తున్నామని, ఉపాధ్యాయులు బాధ్యతతో విద్యాబోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మోత్కుపల్లి పంచాయతీకి జాతీయ స్థాయి పురస్కారం

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హర్షం

**నేటి సాక్షి,వికారాబాద్:** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామ పంచాయతీ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రతిష్టాత్మకమైన "దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారం"కు ఎంపికైంది. తెలంగాణ రాష్ట్రం నుండి ఈ అవార్డుకు ఎంపికైన కేవలం రెండు గ్రామాల్లో మోత్కుపల్లి ఒకటి కావడం విశేషం. ముఖ్యంగా "గుడ్ గవర్నన్స్" (సుపరిపాలన) విభాగంలో మోత్కుపల్లి పంచాయతీ ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. ఆన్‌లైన్ ద్వారా పౌర సేవలు అందించడం, భారత్ నెట్ మరియు సి.ఎస్.సి (CSC) సేవలను పౌరులకు అందుబాటులోకి తీసుకురావడంలో ఈ గ్రామం ఆదర్శంగా నిలిచింది. గ్రామ పంచాయతీ ఆదాయ వ్యయాలు మరియు అభివృద్ధి ప్రణాళికలను 100 శాతం ఈ-గ్రామ్ స్వరాజ్ (e.gram swaraj) వెబ్‌సైట్‌లో పొందుపరచడంతో పాటు, పారదర్శకమైన గ్రామ సభల నిర్వహణ ఈ అవార్డుకు ప్రధాన కారణమయ్యాయి. అదేవిధంగా పీఎం కిసాన్, ముద్రా, జన్ ధన్ యోజన వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా పౌరులకు సమర్థవంతంగా చేరవేయడంలో పంచాయతీ యంత్రాంగం విజయం సాధించింది. మోత్కుపల్లికి జాతీయ స్థాయి అవార్డు రావడం పట్ల తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మరియు వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలతో పాటు జిల్లా పంచాయతీ అధికారి (DPO), ఎంపీడీఓ మరియు ఇతర సిబ్బందిని వారు అభినందించారు.



# పరిగిలో టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు







- అక్రమగ్యాస్, కుళ్ళిన మాంసం నిల్వలు సీజ్
- కల్తీ ఐస్‌క్రీమ్ కేంద్రాలపై పోలీసుల నిఘా.. నలుగురు నిందితులు పోలీసుల అదుపులో
- ప్రజల ఆరోగ్యంతో ఆటలాడితే కఠిన చర్యలు - 12 గ్యాస్ సిలిండర్లు, 35 కిలోల కుళ్ళిన మాంసం స్వాధీనం



**నేటి సాక్షి, వికారాబాద్:** వికారాబాద్ జిల్లా పరిగి పట్టణ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న అక్రమ కార్యకలాపాలపై టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే అన్వర్ పాషా బృందం జరిపిన ఈ తనిఖీల్లో అక్రమ గ్యాస్ సిలిండర్ల నిల్వ, కుళ్ళిన మాంసం విక్రయం, కల్తీ ఐస్‌క్రీమ్‌ల తయారీ కేంద్రాలను గుర్తించి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పరిగి విద్యానగర్ కాలనీలో అక్రమంగా సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచిన కృష్ణ (35) నివాసంపై దాడి చేసి, మొత్తం 12 సిలిండర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదే కాలనీలో మహ్మద్ ఖలీల్ (34) అనే వ్యక్తి తన మటన్ షాపులో నిల్వ ఉంచిన సుమారు 35 కిలోల కుళ్ళిన మాంసాన్ని గుర్తించి సీజ్ చేశారు. అలాగే, పరిగి మెయిన్ రోడ్డులోని 'శ్రీ నిత్య ఐస్‌క్రీమ్' యూనిట్ మరియు సిద్ధార్థ కాలనీలోని 'మహా ఐస్‌క్రీమ్' కేంద్రాలపై దాడులు నిర్వహించి, గడువు ముగిసిన ముడి సరుకులు, పారిశ్రామిక రంగులు ఉపయోగిస్తున్న వర్కాల హన్మంతు (45), కె. రమేష్ (42)లను పట్టుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే అక్రమ కార్యకలాపాలను సహించేది లేదని హెచ్చరించారు. కేవలం లాభాల కోసం కల్తీ ఆహార పదార్థాలు తయారు చేయడం, కుళ్ళిన మాంసాన్ని విక్రయించడం తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వ వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రజల భద్రత విషయంలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని హోటళ్లు, ఐస్‌క్రీమ్ కేంద్రాలపై నిఘా ఉంచుతామని, ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలను గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పట్టుబడిన నిందితులపై కేసులు నమోదు చేసి పరిగి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు వెల్లడించారు.

# బిఆర్ఎస్ కార్యకర్తలు అధైర్య పడకండి

## మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి



**నేటిసాక్షి,తిరుమలాయపాలెం,(రుద్రరాజు):** ప్రభుత్వం లేనంత మాత్రాన కార్యకర్తలు అధైర్య పడద్దని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పిండిప్రోలు, గోల్ తండా, రాజారం, గ్రామాలలో పలువురిని పరామర్శించారు. పిండిప్రోలు గ్రామంలోని ఉప సర్పంచ్ చామకూరి రాజు కూతురు చామకూరి విజయ ప్రూటీ కి ఇటీవల శాస్త్ర చికిత్స చేసుకోగా కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం గోల్ తండా లో మాజీ సర్పంచ్ బానోత్ పంతులు నాయక్ గుండెపోటుతో మృతి చెందగా అతని కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రాజారం గ్రామంలో మెట్టు వెంకన్న భార్య రాధా ఒకే వారం వ్యవధిలో ఇద్దరు గుండెపోటుతో మృతి చెందగా వారి కుటుంబాన్ని ఆయన పరమశించారు. అనంతరం హస్నాబాద్ గ్రామపంచాయతీలో బిఆర్ఎస్ తరఫున గెలుపొందిన సర్పంచ్లను ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. సందర్భంగా హస్నాబాద్ గ్రామపంచాయతీలో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న అరాచకాలను ఘర్షణలను ఆయనకు వివరించారు. బి ఆర్ ఎస్ కార్యకర్తలు ఎవరు తొందరపడద్దని అధికారం ఎవరికి సొంతం కాదని త్వరలో మనమే అధికారంలోకి వస్తామని ఆయన వివరించారు ప్రతి కార్యకర్తకు నేను అండగా ఉంటానని ఎవరు తొందరపడి ఘర్షణలకు పాల్పడుద్దని బిఆర్ఎస్ కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు భాష బోయిన వీరన్న, మండల పార్టీ కార్యదర్శి దేవేందర్ రెడ్డి, నూతన సర్పంచులు కొవ్వూరి పద్మ సత్తిరెడ్డి, బోడ మంజూ రవి, ఉపసర్పంచ్ లు చామకూరి రాజు, షేక్ చందు, పరికపల్లి చంద్రశేఖర్ అసలాది ముత్తయ్య చామకూరి శరత్ చామకూరి సునీల్ చిట్టి మాజీ సర్పంచ్ లు బోడ మంచ నాయక్, బండ్ల సురేష్ ఆలస్యం నాగేశ్వరావు, తమ్మెర రామ్మోహన్ రెడ్డి, బానోతు రంగా, మాజీ ఎంపిటిసి శంకర్, తీగల మేఘనాధరావు కొవ్వూరి సందీప్ రెడ్డి మోటపోతుల పెద్ద శ్రీను మోట పోతుల చిన్న శ్రీను మాగి వెంకన్న తండా అంజయ్య పల్లి వినోద్ పల్లి అశోక్ పల్లి నవీన్ వేల్పుల సైదులు ఉన్నం వెంకటేశ్వర్లు జక్కుల యాదగిరి పాసినేని శ్రీను కొత్తపల్లి మహేష్ జెప్పుల సీతారాములు బానోత్ వెంకన్న సైదా సయ్యద్ హుస్సేన్ సయ్యద్ రంగాపురం బాలకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# పొద్దుతిరుగుడు సేకరణకు అన్ని ఏర్పాట్లు

## మార్క్ ఫెడ్, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ అధికారులతో సమీక్ష



**రాజన్న సిరిసిల్ల,శివకుమార్ :** పొద్దుతిరుగుడు సేకరణకు అన్ని ఏర్పాట్లు చేయాలని మార్క్ ఫెడ్ అధికారులను కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పొద్దుతిరుగుడు పంట కొనుగోలుపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మార్క్ ఫెడ్, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం కలెక్టర్ నిర్వహించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో పొద్దుతిరుగుడు పంట 1,700 ఎకరాల్లో సాగు చేశారని వెల్లడించారు. ఈ పంట కొనుగోలుకు మార్క్ ఫెడ్ ఆద్వర్యంలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. కొనుగోలు కోసం కావాల్సిన సామాగ్రి, వేయింగ్ యంత్రాలు అన్ని ముందస్తుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. క్వింటాల్ పొద్దుతిరుగుడుకు రూ.7721 మద్దతు ధర ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. రైతులు దీర్ఘకాలం పాటు ఆదాయం వచ్చే ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచించారు. దీంతో అధిక దిగుబడి, ఆదాయం వస్తుందని తెలిపారు. సన్న వడ్లు పండించేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మద్దతు ధర, బోనస్ ఇతర లాభాలను రైతులకు వివరించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, మార్క్ ఫెడ్ డీఎం హబీబ్, సహకార శాఖ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ సమ్మేళనాన్ని

## విజయవంతం చేయండి



**నేటి సాక్షి, తిమ్మాపూర్:** తిమ్మాపూర్ మండలం నల్లగొండ గ్రామంలో గల సీతారామ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో 11న నిర్వహించ తలపెట్టిన హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సమితి అధ్యక్షులు బోనాల మోహన్, ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలని కోరుతూ నిర్వహణ సమితి బాధ్యులు బుధవారం ప్రముఖులను కలిసి ఆహ్వానించారు. మొగిలిపాలెం గ్రామ వాస్తవ్యులు డాక్టర్ సముద్రాల శ్రీనివాస్ ను ఆర్థోపెడిక్ సర్జన్ ను ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా రావాలని కోరారు. ఉపాధ్యక్షులు ఎర్రోజు లక్ష్మణ్ తదితరులు వారి వెంట ఉన్నారు.

# ఊర చెరువుకు మహర్ధశ

## శాటిలైట్ మ్యాప్ ద్వారా పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



**నేటి సాక్షి,మేడిపల్లి :** ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలలో వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మేడిపల్లి మండల కేంద్రంలోని ఊర చెరువులోకి నీటిని తేవడానికోసం ప్రతిపాదించగా బుధవారం రోజు ఇరిగేషన్ ఇఇ,డిఇ, మరియు ఏఇ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించడం జరిగింది.మేడిపల్లికి అధికారుల బృందం వచ్చి నీటిని ఎలా ఊర చెరువులోకి తీసుకురావాలి అని రెండు మూడు మార్గాల ద్వారా తీసుకురావచ్చు అని శాటిలైట్ మ్యాప్ ద్వార పరిశీలించి. మేడిపల్లి చెరువు పెద్ద చెరువు మరియు కొండాపూర్ చెరువు ను పరిశీలించడం జరిగింది.సమస్య చెప్పగానే స్పందించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు ధన్యవాదాలు తెలిపిన మేడిపల్లి కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ బొంగోని రాజ గౌడ్, మాజీ ఎంపిటిసి దాసరి శంకర్, కాంగ్రెస్ పార్టీ మేడిపల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మేదరి లాజర్, ఉరుమడ్ల నర్సయ్య, అంకం ప్రభాకర్, దామెర సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

# ఐడీఓసీలో డీఎల్టీసీ సమావేశం

## అధికారులతో కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష



**రాజన్న సిరిసిల్ల,(శివకుమార్):** డిస్ట్రిక్ట్ లెవెల్ టెలికాం కమిటీ (డీఎల్టీసీ) సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ భారత్ నిధి(డీబీఎన్), రికగ్నిషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్, టెలికాం టవర్లకు విద్యుత్ సరఫరా, భారత్ నెట్ ఇన్ఫ్రా, కాల్ బీ ఫోర్ యూ డీజీ మొబైల్ అప్లికేషన్ తదితర అంశాలపై సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులు చేపడుతున్న సందర్భంగా ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా టీ ఫైబర్, బీ ఎస్ ఎన్ ఎల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ గీత, టీ ఫైబర్, బీఎస్ఎన్ఎల్ అధికారులు, మిషన్ భగీరథ, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ



**నేటి సాక్షి వెల్గటూర్:** వెల్గటూర్ మండల కేంద్రంలో ఈ నెల 14న నిర్వహించనున్న డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను పురస్కరించుకుని బుధవారం నూతన ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దళిత, యువజన సంఘాల నాయకుల సమావేశం నిర్వహించగా, ఉత్సవాల నిర్వహణకు కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.కమిటీ అధ్యక్షుడిగా రేగుంట నర్సయ్యను ఎంపిక చేయగా, ఉపాధ్యక్షులుగా నక్క సురేష్, ఓరగంటి రాజయ్య, కుతాడి నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. ప్రధాన కార్యదర్శులుగా తాటి నాగరాజు, మూగల రమేష్, రత్నంను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని ప్రజలు, యువత పెద్దఎత్తున పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

# వేసవి వడగాల్పుల నివారణకు చర్యలు చేపట్టాలి



- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**నేటి సాక్షి, రాజన్న సిరిసిల్ల (శివకుమార్):** వేసవి వడగాల్పుల నేపథ్యంలో జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వడదెబ్బ వల్ల కలిగే నష్టాల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా అటవీ శాఖ అధికారి బాలమణి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, అటవీ, కార్మిక, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తల నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరి వద్ద తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని, ఏవైనా మరమ్మతులు ఉంటే ముందస్తుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్, తహసీల్ కార్యాలయాలు, బస్టాండ్లు మరియు జనాల రద్దీ ఉండే ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఉపాధిహామీ పనులు జరిగే చోట, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నీడ కోసం టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు తాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో మంటలు వ్యాపించకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, మూగజీవాల సంరక్షణ కోసం గ్రామాల్లో నీటి తొట్లను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గోశాలలోని పశువుల సంరక్షణపై పశువైద్య శాఖాధికారి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయి, వైద్యాధికారి రజిత, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, డీఆర్డీఓ గీత, మిషన్ భగీరథ అధికారులు అన్వర్, సుమలత మరియు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కాగజ్ నగర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో 'బ్లాక్ డే'



**నేటి సాక్షి, కొమురం భీం ఆసిఫాబాద్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాగజ్ నగర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. దేశవ్యాప్త నిరసనలో భాగంగా బుధవారం కార్మికులు నల్ల రిబ్బన్లు ధరించి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినదించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్. త్రివేణి మాట్లాడుతూ.. ఏప్రిల్ 1 నుండి 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 4 లేబర్ కోడ్లను అమలు చేయడం కార్మిక వర్గానికి 'దుర్దినం' అని పేర్కొన్నారు. ఈ కోడ్ల వల్ల దేశంలోని 47 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు, 25 కోట్ల మంది సంఘటిత రంగ ఉద్యోగులు తమ హక్కులను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులకు గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ సీనియర్ నాయకులు ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ, బీజేపీ పాలనలో అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా విక్రయిస్తున్నారని విమర్శించారు. సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కును, సమ్మె చేసే హక్కును ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా అణచివేస్తోందని మండిపడ్డారు. ఎస్పీఎం మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ కూషణ రాజన్న మాట్లాడుతూ.. స్థానిక ఎస్పీఎం యాజమాన్యం లేబర్ కోడ్లను అడ్డుపెట్టుకొని యూనియన్ ఎన్నికలు జరగకుండా కుట్ర చేస్తోందని, ఇవి అమలులవస్తే కార్మికులు కట్టుబానిసలుగా మారతారని హెచ్చరించారు. రైతు వ్యతిరేక విధానాలు, వివిజీ రాఘ్జీ చట్టం-2025 వంటి చర్యల ద్వారా కార్మిక లోకాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని నాయకులు ధ్వజమెత్తారు. లేబర్ కోడ్లను రద్దు చేసేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట శ్రీనివాస్ మద్దతు ప్రకటించగా, సీఐటీయూ నాయకులు కృష్ణమాచారి, శంకర్, అశోక్, సంజీవ్, మల్లేష్, అరుణ, పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఫైన్ డబ్బులతో.. వృద్ధులకు పిల్లలకు అల్పాహారం





- శ్రీ వాగ్దేవి ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపల్ రజిత..

**నేటి సాక్షి, మంచిర్యాల,(శ్రీధర్ దమ్ము):** ప్రతి సంవత్సరం ఈ సమయంలో, మా ఆరవ తరగతి మరియు ఏడవ తరగతి విద్యార్థులను వృద్ధాశ్రమం మరియు అనాథాశ్రమానికి తీసుకెళ్తాము. ఈ సందర్శన యొక్క ముఖ్య ఉద్దేశ్యం, వృద్ధులు మరియు అనాథల జీవన పరిస్థితులను పిల్లలకు అవగాహన చేయించడం. విద్యార్థుల నుండి సేకరించిన ఫైన్ మొత్తంతో, వారికి అవసరమైన అల్పాహారం మరియు ఇతర అవసరమైన వస్తువులను కొనుగోలు చేస్తాము. ఆ వస్తువులను మా విద్యార్థులే స్వయంగా అందజేస్తారు. దీని ద్వారా వారికి సహాయం చేసే మనసు మరియు కరుణాభావం పెంపొందుతుంది. సందర్శన అనంతరం, విద్యార్థులకు తల్లిదండ్రుల విలువలు మరియు ప్రాముఖ్యత గురించి వివరిస్తాము. ఎట్టి పరిస్థితుల్లోనూ తల్లిదండ్రులను అవమానించకూడదని లేదా వదిలేయకూడదని వారికి బోధిస్తాము. వృద్ధులను విడిచిపెడితే వారు అనుభవించే భావోద్వేగ మరియు శారీరక కష్టాలను కూడా వారికి తెలియజేస్తాము. ఈ కార్యక్రమం ద్వారా, మా విద్యార్థుల్లో దయ, బాధ్యత, మరియు పెద్దల పట్ల గౌరవం వంటి విలువలను పెంపొందించడమే మా లక్ష్యం

# గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కిరణ్ సాగర్ రావు





- ఉపాధ్యక్షుడిగా నరేష్ చారి.. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి హామీ

**నేటి సాక్షి గజ్వేల్ :** గజ్వేల్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కిరణ్ సాగర్ రావు, ఉపాధ్యక్షుడిగా నరేష్ చారి పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, బార్ అసోసియేషన్ పరిధిలోని న్యాయవాదుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే బార్ అసోసియేషన్‌కు సంబంధించిన అసంపూర్తి భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయడం కోసం ప్రత్యేక చర్యలు చేపడతామని పేర్కొన్నారు. న్యాయవాదులకు అవసరమైన సదుపాయాల కల్పనతో పాటు, బార్ అసోసియేషన్ అభివృద్ధి దిశగా కార్యాచరణ చేపడతామని స్పష్టం చేశారు. ఎన్నికల అధికారిగా ప్రశాంత్ కుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గోపాలరావు, పెద్దిరెడ్డి అశోక్ రెడ్డి, వి. శ్రీనివాస్, పార్థసారథి, వనం భాస్కర్, బాల ముకుంద రెడ్డి, పెండం శ్రీనివాస్, అబ్దుల్ గఫార్, భాగయ్య, సమీర్, రామకృష్ణతో ఎన్నెల్లి స్వామి లతో పాటు పలువురు బార్ సభ్యులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నిజం



**నేటి సాక్షి,మంచిర్యాల (శ్రీధర్ దమ్ము):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 49వ డివిజన్‌లో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సతీమణి, జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ ముఖ్య అతిథిగా హాజరై ఇళ్లను ప్రారంభించారు. మున్సిపల్ మేయర్ ధర్ని మధుకర్‌తో కలిసి ఆమె లబ్ధిదారులు ఫర్జానా బేగం మరియు రుబీనా నహీద్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మరియు స్థానిక నాయకులు సురేఖమ్మను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ.. తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, సొంతింటి కల నెరవేర్చిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు మరియు సురేఖమ్మకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి అర్హుడికి ఇందిరమ్మ రాజ్యం లో న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మహిళా నాయకురాళ్లు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## అయ్యప్ప మహా పడిపూజ



**నేటి సాక్షి,చేర్యాల:** చేర్యాల పట్టణంలోని అయ్యప్ప స్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షులు తాటిపెల్లి ఆంజనేయులు గుప్త ఆధ్వర్యంలో వేద పండితులు చైతన్య శర్మ, నాగరాజ్ శర్మ, రాజు శర్మ వేద మంత్రోచరణల మధ్య పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం అయ్యప్ప స్వామి అభిషేకం,గణపతి పూజ, పుష్పార్చన, మంత్ర పూజ కార్యక్రమాలతో పాటు స్వామి వారికి ఎంతో వైభోపేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఆలయం నుంచి మంగళ వాయిద్యాలు, అయ్యప్ప భక్తుల శరణ ఘోషతో ఆలయం ఆవరణలో అయ్యప్ప స్వామి వారి పల్లకి సేవ నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప.. శరణంశరణం అయ్యప్ప.. స్వామి శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో ఆలయం మార్మోగింది. ఈ మహపడిపూజ మహోత్సవానికి పెద్దఎత్తున భక్తులు పాల్గొని అయ్యప్ప నామస్మర ణం, భజన పాటలు, భక్తి గీతాలను ఆలపించారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేయగా భక్తులు పెద్ద ఎత్తున స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## మహిళా రక్షణకు పెద్దపీట

**ఆసిఫాబాద్ బస్టాండ్‌లో షీ టీం అప్రమత్తత**



**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్ (ఎండి ముబీన్):** జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో షీ టీం సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి ఒక మహిళను సురక్షితంగా కాపాడటంతో పాటు, అల్లరి మూకల బారి నుండి మరో యువతిని రక్షించారు. బుధవారం పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఒక మహిళ అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండటాన్ని అదనపు డిపో మేనేజర్ దేవపాల గమనించి వెంటనే షీ టీంకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే షీ టీం ఎస్సై బిక్కులాల్ తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. తొలుత సదరు మహిళతో మాట్లాడేందుకు ప్రయత్నించగా, ఆమె సరైన స్థితిలో లేక పొంతన లేని సమాధానాలు చెప్పడాన్ని పోలీసులు గుర్తించారు. అనంతరం ఎంతో సహనంతో ఆమె నుంచి పూర్తి వివరాలు సేకరించి, కుటుంబ సభ్యుల ఆచూకీ కనుగొని ఆమెను సురక్షితంగా వారికి అప్పగించారు. అదే సమయంలో బస్టాండ్ పరిసర ప్రాంతంలో ఒక యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న యువకుడిని షీ టీం సిబ్బంది అప్రమత్తంగా గుర్తించి వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అతనికి కౌన్సిలింగ్ నిర్వహించి, భవిష్యత్తులో ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఎస్సై బిక్కులాల్ మరియు సిబ్బంది స్వప్న పాల్గొన్నారు. మహిళల భద్రత కోసం షీ టీం ఎల్లప్పుడూ అప్రమత్తంగా పనిచేస్తుందని, ప్రజలు ఎక్కడైనా అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు.